# పచ్చదనానికి ప్రపంచీకరణానికి మధ్య.!

నేటినిజం

మంగళవారం 3-3-2020

పచ్చదనానికీ, ప్రపంచీకరణకు మధ్య కొనసాగుతున్న సంఘర్షణలో ఒకవైపు ప్రభుత్వాలు, మరోవైపు రాజకీయ పక్షాలు ప్రపంచీకరణకు బాసటగా నిలబడటం దీర్ఘకాల ప్రగతికి గొడ్డలిపెట్టు. భూమిని, పర్యావరణాన్ని కబళిస్తున్న కేంద్రీకృత కృత్రిమ ప్రగతి కేవలం తాత్కాలిక భ్రాంతి మాత్రమే! కానీ, వ్యవసాయాన్ని ధ్వంసం చేస్తున్న అటవీ హసనం చేస్తున్న పారిశ్రామిక ప్రాబల్యానికి ప్రభుత్వాలు ఇతోధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. హరిత పరిరక్షణ నియమావళిని ఉల్లంఘించి అక్రమంగా పుట్టుకొచ్చిన పరిశ్రమలను కేంద్ర ప్రభుత్వం వారు తక్షణం మూసివేయాలి. 'హరిత అనుమతుల' ను పొందిన తరువాత మళ్ళీ ఆ పారిశ్రామిక సంస్థలు ప్రారంభం కావచ్చు! కానీ ఈ నియమాన్ని కేంద్ర ప్రభుత్వమే ఇపుడు నీరు కార్చింది. పరిశ్రమలకు గొప్ప వెసులుబాటు కల్పించింది.

పచ్చదనంపై ప్రపంచీకరణ పైచేయి అవుతుండటానికి ఇది సరికొత్త ఉదాహరణ 'పర్యావరణ అనుమతి' ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్– ఇసి లేకుండానే పరిశ్రమలను నడిపిస్తున్న యజమానులు ఆరు నెలలలోగా కొత్తగా అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నది కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న వెసులుబాటు అంటే ఇది హరిత నియమాలను ఉల్లంఘించిన పరిశ్రమలను క్రమబద్ధీకరించడం వంటిది. నియమనిబంధనలను పాటించకుండా పర్యావరణాన్ని పాడుచేసే లక్ష్యంతో నగరాలలో అంతస్థులను నిర్మిస్తున్నారు.

కానీ ఆ తర్వాత స్థానిక ప్రభుత్వాలు, రాష్ట్రప్రభుత్వాలు కొంత రుసుమును కట్టించుకుని ఈ 'అక్రమాల'ను సక్రమాలుగా మారుస్తున్నారు. దీనికే క్రమబద్ధీకరణ అంటున్నారు. ఇదే రీతిలో పర్యావరణ నియమాలను ఉల్లంఘించిన పరిశ్రమలను మూసివేయాలి. కానీ 'రుసుము' తీసుకొని క్రమబద్ధీకరించినందువల్ల, కాలుష్యపు విషాలను కక్కి పరిసరాలను పాడుచేస్తున్న పరిశ్రమల స్వభావం మారిపోతుందా? అనేది ఆలోచించాలి. ఇవన్నీ గత ప్రభుత్వం ఇచ్చిన వారసత్వమే. ఈ వారసత్వం కారణంగానే ఇపుడు అక్రమ పరిశ్రమలకు ఆరునెలలలోగా 'హరిత అనుమతి' ఇవ్వడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. మరి అడవులకు దిక్కెవ్వరు? హరిత శోభల 'క్షతి'ని నిరోధించి శోభను నిలబెట్టేవారు ఎవ్వరు? ఆకుపచ్చదనం నిజమైన ప్రగతికి సంకేతం! కానీ దశాబ్ధాల తరబడి వ్యవసాయభూముల విస్తీర్ణం తగ్గిపోతోంది! దేశంలో మొత్తం భూభాగంలో కనీసం ముప్పై మూడు శాతం అడవులుండాలనేది అంతర్జాతీయ ఆదర్శం కానీ మన దేశంలో ఇరవైనాలుగు శాతం కంటే తక్కువ భూభాగంలో మాత్రమే అడవులున్నాయి. గత రెండేళ్ళుగా అడవుల విస్తీర్ణం తెలుగు రాష్ట్రాలలో మరీ తగ్గిపోయిందనేది సమాచారం. 'హరితహారం' 'చెట్టు నీరు' వంటి కార్యక్రమాల వల్ల అడవుల విస్తీర్ణం పెరగకపోవడమే అంతుపట్టని వ్యవహారం. అడవులతోపాటు జంతువులు కూడా నశించిపోతున్నాయి. అడవులలో నీటివాగులు ఎండిపోవడం వల్ల క్రూర జంతువులు, సాధుజంతువులు సమానంగా దప్పికతో అంతరించిపోతున్నాయి. ఇవి కాక అగ్నిప్రమాదాలు ! ఇక అరణ్యాలకు రక్షణ ఎపుడు..?

# ఉమ్మడి జిల్లాలో కోట్లలో విద్యుత్ బకాయిలు

**–వసూళ్లకు రంగంలోకి దిగిన అధికారులు**

కరీంనగర్,మార్చి2(ఆర్ఎన్ఎ): ఈనెల 31లోగా విద్యుత్ బకాయిలు ఉన్న వినియోగదారులంతా వెంటనే చెల్లించాలని ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు రంగంలోకి దిగారు. బకాయిలా జాబితా తీసుకుని గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బిల్లులు కట్టేలా చేస్తున్నారు. వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయాలంటే ప్రతి వినియోగదారులు వారు వినియోగించుకున్న విద్యుత్ కు సరిపడా బిల్లులను సకాలంలో సక్రమంగా చెల్లించినప్పుడే అది సాధ్యపడుతుందని అన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో రూ.115 కోట్లమేర విద్యుత్ బకాయిలున్నాయనీ, ఇందులో విధిదీపాలు, నీటిసరఫరా బిల్లులు, వ్యవసాయ, గృహ, పరిశ్రమల బిల్లులు ఉన్నాయని చెప్పారు. ఇంత పెద్ద మొత్తంలో బిల్లులు బకాయిలు పడడం వల్ల సంస్థ ఇబ్బంది ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని.. ఈనెల 31 వరకు బకాయిల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ చే పడుతున్నారు. ఒక్కో మండలానికి ఒక్కో నోడల్ అధికారిని నియమించామనీ, బకాయిదారులందరికీ ఇప్పటికే సమాచారం ఇచ్చామనీ, వెంటనే స్పందించి వారి వారి బకాయిలను ఈనెల 31లోపు చెల్లించాలి కోరారు. బకాయిలు చెల్లించని వారి సర్వీసులు కట్ చేస్తామని చెప్పారు. ఈ పరిస్థితి రాకుండా ఉండేందుకు బకాయిపడిన వినియోగదారులంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని రంగాలకు 24గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తూ యావత్తు దేశం దృష్టిని ఆకర్షిస్తున్న తెలంగాణ ప్రభుత్వం వినియోగదారులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా మరింత మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలని చూస్తుందన్నారు. ఇందుకోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇదిలావుంటే వినియోగదారులకు, విద్యుత్ సిబ్బందికి మధ్య అవినాభావ సంబంధం ఉంటేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాలకు వెళ్లినప్పుడు బాకీల వారు వచ్చినట్లుగా కాకుండా మంచి రిలేషన్ష్ ఉండేలా చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ సరఫరా ఎవరూ ఊహించని విధంగా జరుగుతుంది.. 2018 జనవరి నుంచి వ్యవసాయ రంగానికి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఈ నేపథ్యంలో పడే లోడ్ తట్టుకునేందుకు కావాల్సిన ట్రాన్స్ డిస్ట్రిబ్యూటరీ లైన్లు, సబ్ వంటివి ఇప్పటికే ఏర్పాటు చేశారు. మరింత మెరుగైన సరఫరా కోసం మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. సౌకర్యాలను విస్తృతం చేయాలంటే అవన్నీ ఆర్థిక వనరులతో ముడిపడి ఉంది. ఇవన్నీ వనిఇయోగదారులకు తెలిసేలా చేస్తున్నారు. వాడుకున్న విద్యుత్ సరిపడా వినియోగదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తే మరింత మెరుగ్గా సర్వీసు ఇవ్వడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అయితే బకాయిలు పెరిగి పోతున్నాయనీ, ఫలితంగా విద్యు త్ పంపిణీ సంస్థలు మరింత ప్రగతిని ముందుకు తీసుకెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.

## ఎన్నికల్లో ఓడుతున్న మారని తీరు

కరీంనగర్,మార్చి2(ఆర్ఎన్ఎ): సాధించుకున్న స్వరాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు అన్నారు. 14ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితమే తెలంగాణ అని అన్నారు. బంగారు తెలంగాణ లక్ష్యంగా చేపట్టిన కార్యక్రమాలు సాకారం అవుతున్నాయని, వీటిని చూసి తట్టుకోలేని కాంగ్రెస్ వారు విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవలి అన్ని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరించారని, కాంగ్రెస్‌కు పరాభవం తప్పలేదన్నారు. నిజానికి బంగారు తెలంగాణకు మోకాలడ్డుతున్నది కాంగ్రెస్ వారేనని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 42 రోజుల సకల జనుల సమ్మెలో ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయులు పాటు ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ వ్యవస్థలో పనిచేస్తున్న అందరిని పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిన ప్రకారమే సిఎం కెసిఆర్ నిర్ణయం తీసుకుంటే కాంగ్రెస్ వారు కోర్టుకెక్కిన విషయం మరువారదన్నారు. గిరిజనులు, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు చూస్తే గతంలో ఎప్పుడయినా ఇలా చేశారా అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించుకోవాలన్నారు.

## యువ సర్పంచ్‌లు బాగా పనిచేయాలి

జగిత్యాల,మార్చి2(ఆర్ఎన్ఎ):గ్రామాలను ప్రగతి పథంలో నిలపడంలో సర్పంచుల పాత్ర కీలకమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో యువకులకు మంచి అవకాశం వచ్చిందనీ, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ సారీ ఎన్నికల్లో యువకులు పెద్ద మొ త్తంలో సర్పంచులుగా ఎన్నికయ్యారనీ, యువత రాజకీయాల్లోకి రావడం శుభ సూచకమన్నారు. సిఎం కెసిఆర్ పథకాలను ఆచరణలో పెటడ్డంలో వారే కీలకమని అన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని అన్నారు. అలాగే పథకాలను గ్రామస్థాయిలో అమలు చేసే బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. నిరంతరం ప్రజలకు అం దుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

## అక్రమంగా కలప కలిగివుంటే చర్యలు

కామారెడ్డి,మార్చి2(ఆర్ఎన్ఎ):అడవులను నరికివేస్తే పీడీ యాక్టు కేసు నమోదు చేస్తామని కామారెడ్డి డీఎఫ్ఓ హెచ్చరించారు. అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, చెట్లను నరికివేయద్దవని సూచించారు. అడవులను నరికితే పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని అన్నారు.స్మగ్లర్లు కలప కోసం అడవులను నరికితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా కలప అక్రమ రవాణాకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అడవులను నాశనం చేయవద్దని కోరారు. ఇంటి నిర్మాణానికి కలప అవసరం ఉంటే ప్రభుత్వ పర్మిట్ ఉన్న టింబర్ డిపోల్లో కొనుగోలు చేయాలని సూచించారు. రాష్ట్ర భూ భాగంలో 33 శాతం అడవులు ఉండాలని, కానీ తెలంగాణలో కేవలం 12 శాతం మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఇటీవల పలు ఇళ్లలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను స్వాధీనం చేసుకొన్నామని అన్నారు.

## రికవరీ వెంటనే నిలుపుదల చేయాలి

గోదావరిఖని,మార్చి2(ఆర్ఎన్ఎ): సింగరేణి సంస్థలో సీపీఆర్ రికవరీని వెంటనే నిలుపుదల చేయాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బీ వెంకట్రావు అన్నారు. సింగరేణిలో రిటైర్డ్ అనంతరం వైద్య సేవల కోసం ప్రవేశపెట్టిన సీపీఆర్ పథకం కోసం అనేక సంవత్సరాల సర్వీస్ ఉన్న కార్మికుల దగ్గర నుంచి నెలకు రూ.2వేలు రికవరీ చేయడం దారుణమన్నారు. ఇలాంటి రికవరీని నిలుపుదల చేయాలన్నారు. కార్మికులకు సీపీఆర్ చేరాలా వద్దా అనే ఆప్షన్ ఇవ్వాలన్నారు. నిర్దాక్షిణ్యంగా సీపీఆర్ చేర్చి రికవరీ చేయడం తగదన్నారు. అవసరమైతే పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

# విదేశీ విద్యపైనా కరోనా ప్రభావం

హైదరాబాద్, ఫిబ్రవరి 2:కరోనా కారణంగా ప్రపంచం ఇప్పుడు అన్ని రంగాల్లో విపరీతమైన ప్రభావం ఎదుర్కొంటోంది. తాజాగా పర్యాటకరంగం విపరీతంగా నష్టపోతోంది. ప్రపంచంలో రాకపోకాలు తగ్గాయి. విదేశాలకు వెళ్లాలంటేనే భయం వెన్నాడుతోంది. దీనికితోడు అంతర్జాతీయ విమానాల రాకపోకలు తగ్గాయి. అలాగే విద్యారంగంపైనా కరోనా ఎఫెక్ట్ పడుతోంది. వివిధ దేశాలకు ఉన్నత చదువులకు వెళ్లాలనుకునే వారికి కరోనా అడ్డంకిగా మారింది. అంతర్జాతీయ విద్యకు సంబంధించి మానవచరిత్రలో అతిపెద్ద అంతరాయానికి కరోనా వైరస్ వ్యాప్తి కారణం కావచ్చన్న భయం నెలకొంది. విద్యకోసం వివిధ దేశాలకు వెళుతున్న విద్యార్థుల అంతర్జాతీయ పర్యటనలకు కరోనా వైరస్ భారీస్థాయిలో అడ్డుకట్ట వేస్తోందని అంచనా. లక్షలమంది చైనా విద్యార్థులు.. విదేశాలకు వెళ్లేకుండా పోయింది. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే సమయానికి ఆయా దేశాలకు చేరుకునే అవకాశాలు సన్నగిల్లిపోతున్నాయి. విదేశాల్లో చదువుతున్న చైనా విద్యార్థులకు సొంత దేశం వెళ్లాలన్నా కుదరడం లేదు. ఇప్పటికే చైనాను వణికిస్తున్న కరోనా వైరస్ కల్లోలం ప్రపంచ ఆర్థిక రంగంపై తీవ్ర ప్రభావం చూపడం ఆందోళన కలిగిస్తోంది. చైనానే కాకుండా పక్కనే ఉన్న భారత్ సహా అనేక దేశాలపై దీని ప్రభావం పడింది. వ్యాధి చైనాకే పరిమితం అయినా దాని ప్రభావం ఆర్థికరంగాన్ని కుదిపేస్తోంది. ఇది అంటువ్యాధి అని అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ హెచ్చరించడంతో మరింత జాగరూకతతో ఉండాల్సిన అగత్యం ఏర్పడింది. ఇప్పటికే 57 దేశాలకు ఇది వ్యాప్తి చెందింది. దీంతో చైనా ఆర్థికంగా దెబ్బతినడం తో పాటు ప్రపంచ దేశాలను కూడా దెబ్బతీస్తోంది. చైనా నుంచి ఉత్పత్తులు నిలిచిపోవడంతో అనేక దేశాల్లో ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటుపై కరోనా ప్రభావంపై అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఐఎంఎఫ్ ఆందోళన వ్యక్తం చేస్తోందంటే ప్రభావం ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇపుడిప్పుడే కోలుకుంటున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కరోనా వైరస్ కచ్చితంగా గండి కొడుతుందం టున్నారు. వ ఇదేశీ విద్యతో లాభపడుతున్న అమెరనికా, ఆస్ట్రేలియా, కెనడా లాంటి దేశాలపై కూడా ఇది తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ విపత్తును ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాలని కోరుతున్నారు. ప్రపంచాన్ని భయోత్పాతంలో ముంచేసిన కరోనా ఉధృతి క్రమంగా తగ్గుముఖం పడుతున్నట్టు కనిపిస్తున్నా దాని ప్రభావం ఇప్పుడిప్పుడే తొలిగేలా లేదు. 2001 సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అమెరికా ప్రత్యేకించి మధ్యప్రాచ్య దేశాలకు చెందిన విద్యార్థుల వీసా నిబంధనలను కఠినతరం చేయడమే కాకుండా తాత్కాలికంగా తన సరిహద్దులను మూసివేసింది. దీంతో వేలాదిమంది విద్యార్థులు వివిధ విదేశీ విద్యా కేంద్రాలను ఎంచుకోవల్సి వచ్చింది. 2018లో సౌదీ అరేబియా ప్రభుత్వం.. కెనడాలో చదువుతున్న తన పౌరులను వెనక్కు తిరిగి రావలసిందిగా ఆదేశించింది. కెనడాలో చదువుకుంటున్న 12 వేలమంది సౌదీ విద్యార్థుల్లో చాలామంది తమ చదువుల కోసం కెనడా వదిలిపెట్టి ఇతర దేశాల విద్యాసంస్థలకు తరలిపోయారు. ఇంతకు ముందు ఎన్నో ఉపద్రవాలను చూసినా, చైనాలో తలెత్తుతున్న ఇలాంటి స్థాయి ఉపద్రవాన్ని చరిత్రలో ఎన్నడూ చూడలేదు. అందుకే చైనా నుంచి వెళ్లే విద్యార్థులకు తీరని నష్టం జరుగుతోంది. చైనా నుంచి వచ్చేవారిని ఇతర దేశాలు ఆదరించడం లేదు. అంతర్జాతీయ విద్యార్థుల్లో చైనా విద్యార్థుల సంఖ్య 28 శాతంగా ఉంటున్నట్లు లెక్క. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో చైనా నుంచి విద్యార్థులు అమెరికాకు వెళ్లి చదువుతుండగా, రెండో స్థానంలో భారతీయ విద్యార్థులు అమెరికాలో చదువుకుంటున్నారు. అందుకే అమెరికాకు వెళ్లే విద్యార్థులపై ఈ కరోనా వైరస్ వ్యాప్తి ప్రభావాన్ని చూపుతోంది. కరోనా వైరస్ సంక్షోభం విదేశాల్లో చదువుకుంటున్న చైనా విద్యార్థులపై ఊహించడానికి వీల్లేనంత తీవ్రస్థాయిలో తాకింది. ఈ సంక్షోభం వారి విద్యకు అంతరాయం కలిగించడమే కాకుండా, వారికి దక్కాల్సిన వసతి, తాత్కాలిక ఉద్యోగం, భవిష్యత్తు ప్రణాళికలపై కూడా తీవ్ర ప్రభావం వేయనుంది.చైనా నుంచి భారీగా విద్యార్థుల సంఖ్య పడిపోయిన కారణంగా తరగతి గది పరిమాణం, ఉపాధ్యాయుల సంఖ్యపై తీవ్ర ప్రభావం పడుతోంది.పైగా కరోనా వైరస్ ప్రభావాలు ఇంతటితో ఆగిపోలేదు. అంతర్జాతీయ విద్యార్థులకు సేవలం దించే పర్యాటక పరిశ్రమ, వసతి కల్పించేవారు, రెస్టారెంట్లు, రిటైలర్లు కూడా తీవ్రంగా దెబ్బతింటు న్నారు. కరోనా వైరస్ ఎలా పరిణమించినప్పటికీ, దాని ఆర్థిక ప్రభావం గణనీయంగానే ఉండబోతోంది. చైనా విద్యార్థుల సంఖ్య పడిపోతే అనేక బిలియన్ల కొద్ది డాలర్ల మేరకు నష్టం వాటిల్లుతుంది. కరోనా వైరస్‌ని వేగంగా నిరోధించినట్లయితే, చైనాలో ఉండిపోయిన విద్యార్థుల్లో లక్షమంది వరకు ఈ సెమిస్టర్‌లోనే అంతరాయం లేకుండా ఆయా దేశాల్లో తమ విద్యను కొనసాగించవచ్చు. ప్రత్యేకించి విదేశాల్లో విద్యకోసం ఎదురుచూస్తున్న చైనా విద్యార్థులు ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఎలా స్పందిస్తుందనే అంశంపై దృష్టి సారిస్తున్నారు. వేగంగా వ్యాపిస్తున్న ఈ సంక్షోభం పలు సవాళ్లను విసురుతోంది. కరోనా వైరస్ మానవులపై కలిగించబోతున్న దుష్ఫలితాల పట్ల సమాజం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ విద్యార్థులు, అంతర్జాతీయ విద్యా సంస్థలతో ముడిపడిన వారి సంక్షేమాన్ని పట్టించుకోవాల్సి ఉంది. పర్యాటక రంగాన్ని కుదుపు కుదుపుతున్న కారణంగా దాని ప్ర భావం అన్ని దేశాలపైనా పడుతోంది. విమానయాన రంగంపై మరింత తీవ్రంగా ఉంటోంది.

# బడ్జెట్‌లో పెరగనున్న వ్యవసాయ కేటాయింపులు?

**తాజా పథకాల కారణంగా పెరగనున్న అంచనాలు**

**కెసిఆర్ సూచనల మేరకు కసరత్తు చేస్తోన్న ఆర్థిక శాఖ?**

హైదరాబాద్,మార్చి2(ఆర్ఎన్ఎ): కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి, ధాన్యం కొనుగోళ్లకు కేటాయింపులు పెరిగిన దరిమిలా రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయబోతున్నారని సమాచారం. వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ పెడతామని కూడా సిఎం గతంలో ప్రకటించారు. అయితే దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అయితే ఈ బడ్జెట్ మాత్రం వ్యవసాయానికి సంబంధించి ప్రత్యేకంగా ఉండబోతున్నదని సమాచారం. పెట్టుబడి పథకం కింద ఎకరాకు పదివేలు, వ్యవసాయానికి 24 గంటల విద్యుత్, ఎరువులు, మందులు అందించడం తదితర అంశాలను కీలకంగా తీసుకున్న ప్రభుత్వం ఇందుకు అనుగుణంగా కసరత్తు చేస్తోంది. మార్చి మొదటివారంలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించనున్నారు. రెండో వారంలో బ్జడెట్‌ను ప్రవేశపెట్టేందుకు ఆర్థిక శాఖ సన్నాహాలు మెదలుపెట్టింది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దిశానిర్దేశం మేరకు భారీ బ్జడెట్‌ను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వీటికి తోడు గొల్లకుర్మలకు గొర్రెల పంపిణీ, చేపల పంపిణీ తదితర కార్యక్రమాలు కూడా పెత్త ఎత్తున చేపట్టారు. వ్యవసాయానుబంధ రంగాల్లో వీటిని చూప నున్నారు. ఇప్పటికే ఈవీటి కోసం నిధులు వెచ్చించారు. ఈ లెక్కలు కూడా తీసుకుంటే వ్యవసాయానికి కేటాయింపులు జరగాలి. మార్కెట్ సంక్షోభాన్ని అధిగమించేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. పంటలను కొనుగోలు చేసేందుకు ప్రత్యేక నిధిని కూడా ఏర్పాటు చేసే ఆలోచనలో సిఎం కెసిఆర్ ఉన్నారు. దేశంలోని రెవెన్యూ మిగులు ఉన్న రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణలో ఆర్థిక పరిస్థితులేంటి.. జీఎస్టీ ఆదాయ వ్యయాలెలా ఉన్నాయో.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తమ ఆదాయ వ్యయాల చిట్టాను తీసింది. ఈ దశలో వ్యవసాయాధిరతంగా ప్రభుత్వం అనేక చర్యలను చేపట్టింది. దీంతో వ్యవసాయానికి కేటాయింపులు పెంచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. మిగులు ఆదాయం ఉంటుందని ప్రభుత్వం వేసిన అంచనాలు అందుకోవటం కష్టంగానే ఉంది. వాస్తవ ఆదాయానికి మించి అంచనాలు వేసుకోవటంతో పాటు పన్నుల ద్వారా వచ్చే ఆదాయం మదింపు చేసి బడ్జెట్‌కు వెళుతున్నారు. ప్రధానంగా ఎక్సైజ్ డ్యూటీ ద్వారా వచ్చే ఆదాయం ఖజానాకు ఊత మిచ్చింది. ద్రవ్య లోటును భర్తీ చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తీసుకుంది. అయినా ఆదాయా మార్గాలపై అన్వేషణ ఉంది. మిషన్ భగరీథ, మిషన్ కాకతీయ, పెట్టుబడి పథకాలకు పెద్ద ఎత్తున నిధులు కావాల్సి ఉంది. వీటికి కేటాయింపులు కూడా జోడించాలి. అందుకే బడ్జెట్ కేటాయింపులు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

# వేటగాళ్లతో అడవి జంతువులకు ఉచ్చు

**తరచూ కరెంట్ తీగలతో ప్రమాదాలు**

**అడవి దొంగల పనిపట్టాలంటున్న ప్రజలు**

ఆదిలాబాద్,మార్చి 2(ఆర్ఎన్ఎ): అడవుల్లో జంతువులకు రక్షణ లేకుండా పోతున్నది. అడవులచుట్టూ పలు గ్రామాల్లో విద్యుత్తు తీగలతో జంతువుల వేటతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అడవుల్లో జంతుతువుల వేటతో వన్యప్రాణులు హరిండుకుపోతున్నాయి. ఈ తరహా వేటపై అటవీ, విద్యుత్తు, పోలీసు శాఖలు సమన్వయంతో దాడులు చేసి వీటిని ముందుగా నిరోధించాలి. ప్రస్తుతం కుశ్నపల్లి, నీల్వాయి రేంజ్ పరిధిలో సంచరిస్తున్న పెద్ద పులికి ముప్పు పొంచి ఉందని చెప్పవచ్చు. పలుమార్లు పులి సంచరిస్తునున్నట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. పులులు వేటగాళ్ల ఉచ్చులో బలికాక ముందే చర్యలు తీసుకోవాల్సిఉంది. వేటగాళ్ల బారి నుంచి పులిని రక్షించాలంటే అటవీ జంతువుల కోసం అమర్చే తీగలను తొలగించే ప్రయత్నం జరగాలి. అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా పులులు వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్నాయి. అడవులు, వన్యప్రాణులను సంరక్షించాల్సిన క్షేత్రస్థాయి అధికారులు విధి నిర్వహణను నిర్లక్ష్యం చేస్తున్నారు. పులుల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక నిధులు మంజూరు చేస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా కవ్వాల్ పులుల అభయారణ్యం ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎన్ని పులులు ఉన్నాయో కూడా అధికారులకు తెలియని పరిస్థితి ఉంది. నామమాత్రంగా అక్కడక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన చేతులు దులుపుకొన్నారు. వాస్తవానికి అడవి పందులు, దుప్పులు జింకల కోసం ఈప్రాంత వేటగాళ్లు అడవిలో 11 కేవీ విద్యుత్తు తీగలకు వైర్లు తగిలించి వేటాడుతుంటారు. ఇలా అమర్చిన తీగలకు పశువులతో పాటు అడవులకు వెళ్లే గిరిజనులు విద్యుద్ఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరి కొందరు తీవ్ర అస్వస్థతకు గురై మంచానికే పరిమితమయ్యారు. వాస్తవానికి అడవికి వంటచెరుకు కోసం ఇతర పనుల కోసం వెళ్ళే వారికి భూమిలో అమర్చిన తీగలు కనిపించక ప్రాణాలు వదులుతున్నారు. ఇలా అయిదేళ్ల వ్యవధిలో కనీసం 20 పశువులు, నలుగురు వ్యక్తులు ప్రమాదాలకు గురై బలయ్యారు. విద్యుత్తు తీగలను ప్రధాన లైనుకు తగిలించి భూమిలో కప్పిపెడుతూ అడవి లోపలివరకు తీసుకెళ్లి వదులుతారు. అడవిలో నడిచే వారికి కనిపించకుండా కాలుకు తగిలిందో ప్రాణం పోయే పరిస్థితి ఉంటుంది. దీంతో జంతువులు వేటగాళ్ల ఉచ్చులో పడుతున్నాయి. ఇలా చేయడం వల్ల అటవీ ప్రాంతంలో దుప్పిలు, జింకలు, అడవి పందులు వంటి జంతువులు అంతరించి పోతున్నాయి. పట్టపగలే గుంపులు గుంపులుగా కనిపించే జంతువులు అంతరిస్తున్నాయి. వేటగాళ్లు వీటిని మట్టుపెట్టి మాంసంతో వ్యాపారం చేస్తున్నారు. వేటగాళ్లు అమర్చే తీగలకు పెద్దపులి బలిఅయ్యే అవకాశం లేకపోలేదు. అడవుల రక్షణపై రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలగా ఉంది. సిఎం కెసిఆర్ ఈ విషయంలో కఠినంగా ఉండాలన్న నిర్ణయం కారణంగా కదలిక వస్తోంది. ఆలస్యంగా అయినా అడవులను రక్షించుకోవాల్సిందే. ఇష్టం వచ్చినట్లుగా అడవుల నరికివేత కారణంగా వేల ఎకరాల అడవులు నాశనం అయ్యాయి. అడవులను నరుక్కోవడం వల్ల పర్యావరణం దెబ్బతినడమే గాకుండా సర్వత్రా విపరీత పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. అడవులను, జంతువులను కాపడుకుంటేనే మానవ మనుగడ సాధ్యం. లేకుంటే గాలి,నీరు కూడా దక్కదు. అడవి జంతువులను కూడా కాపడుకుంటే అడవులు కూడా పచ్చగా నిలబడతాయి. కలప స్మగ్లింగ్‌ను పూర్తిగా నిరోధించాలని, అడవుల నుంచి పూచికపుల్ల కూడా బయటికి పోవద్దని ముఖ్యమంత్రి కేసీఆర్ కఠినంగా వ్యవహరించడం వల్ల ఇప్పటికైనా అధికారులు మేల్కోవాలి. అటవీ ప్రాంత ప్రజలకు, పర్యావరణ ప్రియులకు ఇవి ఆనందాన్నిచ్చే నిర్ణయాలుగా చూడాలి. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పూర్తిగా మదింపు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. నిర్ణయాలను కఠినంగా అమలు చేస్తేనే అటవీ సంరక్షణ సాధ్యమవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. అందుకు అనుగుణంగా అటవీశాఖను సంపూర్ణంగా ప్రక్షాళన చేయడం ద్వారా పాతుకుపోయిన అవినీతిని అంతం చేయాల్సి ఉంది. ఇంటిదొంగల పనిపడితే తప్ప ప్రక్షాళన సాగదు. క్షేత్రస్థాయిలో అక్రమార్కుల మార్గాలను పూర్తిగా మూసివేయాల్సి ఉంది. అడవులను నాశనం చేస్తూ, అక్రమాలకు పాల్పడుతున్న వారు ఎంతటి వారైనా ఉరితీసినా పాపం లేదు. వారివల్ల మొత్తం పర్యావరణం దెబ్బతింటోంది. అడవుల్లో ఉన్న జంతువులు నాశనం అవుతున్నాయి. ఇకపోతే అడవి జంతువుల వేట కోసం బిగించిన విద్యుత్ కంచెల కారణంగా సామాన్యులు, జంతువుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడ్డాయి. వన్యప్రాణులకు తరచూ వేటగాళ్లు ఉచ్చులు బిగిస్తున్న విషయం అధికారులకు తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇవన్నీ పోయి అడవుల రక్షణ సజావుగా సాగాలంటే క్షేత్రస్థాయిలో కఠిన చర్యలకు ఉపక్రమించాలి.

## ప్రాపర్టీ షో గ్రీవెన్స్‌కు విశేష స్పందన: జీహెచ్ఎంసీ కమిషనర్

హైదరాబాద్,ఫిబ్రవరి 2: ప్రాపర్టీ ట్యాక్స్ సమస్యలను పరిష్కరించుటకు ఆదివారాల్లో నిర్వహిస్తున్న ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం గ్రీవెన్స్‌కు మంచి స్పందన లభిస్తున్నదని జీహెచ్ఎంసీ కమిషనర్ డీ.ఎస్.లోకేశ్‌కుమార్ తెలిపారు. గ్రీవెన్స్‌లలో ఇప్పటివరకు వచ్చిన 782 ఫిర్యాదులలో 127 పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. ఆదివారం అందిన 348 సమస్యల్లో 23 సమస్యలు వెంటనే పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. మిగిలిన వాటి పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ అధికారులను ఆదేశించారు.

# మళ్లీ విజృంభిస్తున్న స్వైన్‌ఫ్లూ

**గాంధీలో ఇటీవల గర్భిణి మృతితో కలవరం**

**ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు**

హైదరాబాద్,మార్చి 2(ఆర్ఎన్ఎ): ఇటీవల స్వైన్‌ఫ్లూ మళ్లీ విజృంభిస్తు న్నదని, అందువల్ల జాగ్రత్తలే మందు అని గాంధీ వైద్యులు హెచ్చరించారు. దేశవ్యాప్తంగా రోజూ పదుల సంఖ్యలో కొత్తగా స్వైన్‌ఫ్లూ పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. చలితో జ్వరం, జలుబు వస్తే చాలు ప్రజలు వణికిపోతున్నారు. స్వైన్‌ఫ్లూ సోకిందేమోనని కంగారు పడుతూ హాస్పిటల్‌కు పరుగులు పెడుతున్నారు. తాజాగా గాంధ ఈ ఆస్పత్రిలో ఓ గర్భిణి మరణించడం కలకలం రేపుతోంది. మహిళ మృతి చెందడంతో మరోమారు భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఇది సాధారణ జలుబుగా ప్రారంభం అయి, ఆరు రోజుల తర్వాత రోగ లక్షణాలు బయటపడతాయని వైద్యులు తెలిపారి. తగ్గని జ్వరం, తలనొప్పి, గొంతునొప్పి ఈ వ్యాధి ప్రధాన లక్షణాలుగా గుర్తించి చికిత్స తీసుకోవాలన్నారు. ఆయాసం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, ఒళ్లు నొప్పులు, తీవ్ర నీరసం, ముక్కు కారడం, విడువని దగ్గు తదితర లక్షణాలు కనిపిస్తాయి. కొందరికి వాంతులు, విరేచనాలు కూడా అవుతాయి. స్వైన్‌ఫ్లూ రోగులు దగ్గినా, తుమ్మినా వైరస్ గాలిలోకి వ్యాపిస్తుంది. పక్కనే ఉన్నవారు ఆ గాలిని పీల్చితే వారి శరీరంలోకి చేరుతుందన్నారు. ఆస్తమా, డయాబెటిస్, స్థూలకాయం, గుండె జబ్బులు, తక్కువ రోగ నిరోధకశక్తి ఉన్నవారికి, గర్భిణులకు, చిన్నపిల్లలకు ఈ వైరస్ త్వరగా వ్యాప్తి చెందుతుందని అన్నారు. ఫ్లూ రోగుల తుంపర్లు, ఉమ్ములోనూ వైర స్ ఉంటుంది. పొరబాటున వాటిని ముట్టుకొని, ఆ చేతితో నోరు, ముక్కు, కండ్లు, శరీరంపై గాయాలున్నచోట రుద్దుకుంటే వైరస్ మన శరీరంలోకి ప్రవేశిస్తుంది. మార్కెట్‌లో స్వైన్‌ఫ్లూ నివారణ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. మొదటి డోసు ఇచ్చాక మూడు వారాలు ఆగి మరో డోసు ఇస్తారు. వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాత వైరస్‌ను ఎదుర్కొనేం దుకు శరీరానికి రెండు వారాల సమయం పడుతుంది. స్వైన్‌ఫ్లూ బారినుంచి తప్పించుకోవాలంటే రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం, వీలైనన్నిసార్లు చేతులు కడుక్కోవడం, శుభ్రంగా ఉండటం తప్ప వేరే మార్గం లేదని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ దగ్గేటప్పుడు, తుమ్మినప్పుడు ముక్కుకు, నోటికి చేతులను లేదా కర్చీఫ్, టిష్యూ పేపర్లను అడ్డుగా పెట్టుకోవాలి. ఆ తర్వాత కచ్చితంగా చేతులను, కర్చీఫ్‌ను శుభ్రంగా కడుక్కోవాలి. చిన్నారులకు ముందుగానే సీజనల్ ఫ్లూ నివారణ వ్యాక్సిన్లను వేయించాలి. స్వైన్‌ఫ్లూ విజృంభిస్తున్న సమయంలో పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు నోటికి అడ్డుగా సర్జికల్ మాస్క్ లేదా రుమాలు లేదా కర్చీఫ్ చుట్టుకోవాలి. జ్వరంతోపాటు తలనొప్పి, గొంతునొప్పి, దగ్గు, ఒంటి నొప్పులు, తీవ్రమైన నీరసం ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. కుటుంబ సభ్యులు, బంధువుల్లో ఎవరైనా స్వైన్‌ఫ్లూ బారినపడితే మిగతావాళ్లు అప్రమత్తంగా ఉండాలి. ఓవైపు రోగికి చికిత్స అందిస్తూనే సొంత రక్షణ చర్యలు కూడా తీసుకోవాలి. స్వైన్‌ఫల్లూ రోగులు ముక్కుకు, నోటికి అడ్డంగా సర్జికల్ మాస్క్ లేదా కర్చీఫ్ వంటివి కట్టుకుంటే ఇతరులకు వ్యాపించదని అన్నారు. తెలంగాణలోనూ ఫ్లూ కేసుల సంఖ్య పెరుగుతున్నది.

## యూపిలో పాగా వేసే యత్నాలు

**పావులు కదుపుతున్న కాంగ్రెస్ నేత ప్రియాంక**

**రాజ్యసభకు పంపించే ఏర్పాట్లలో కాంగ్రెస్**

న్యూఢిల్లీ,మార్చి 2(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ కార్యదర్శి ప్రియాంక గాంధీ ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. అక్కడ పునాది వేసుకుని రావాలని నిత్యం పర్యటిస్తున్నారు. యూపిలో పాగా వేస్తే దేశంలో పాగా వేయొచ్చన్న భావనలో ఉన్నారు. అందుకే తరచూ ఎక్కువగా అక్కడే పర్యిస్తూ యోటి సర్కార్‌ను, మోడీ సర్కార్‌ను టార్గెట్ చేస్తున్నారు. కాంగ్రెస్‌లో రాహుల్ అస్త్రసన్యాసంతో కొత్త శక్తుల పునరేకీకరణకు అవకాశం ఏర్పడింది.అలాగే రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ దాదాపుగా దూరం అవుతున్నారు. ఆ మేరకు సోనియా గాంధీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష బాధ్యతలనుంచి రిటైర్ అయ్యారు. సోనియా రాజకీయాల నుంచి తప్పుకుంటే ఆమె ప్రస్తుతం కొనసాగుతున్న రాయ్‌బరేలీ స్థానం ఎవరి చేతుల్లోకి వెళుతుంది అన్నదే ప్రధాన ప్రశ్నగా చర్చ నడుస్తోంది. అయితే తదుపరి రాయబరేలి ప్రియాంక చేతుల్లోకి వెల్లడం ఖాయంగా కనిపిస్తోంది. రాహుల్‌ను, ప్రియాంకను రాజకీయంగా ఉన్నత స్థానాల్లో చూడాలని తల్లిగా సోనియా కోరుకుంటున్నారు. సోనియా గాంధీ మేధస్సు, ఆశీస్సులు పార్టీకి ఎప్పటికీ అవసరమని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. సోనియా భవిష్యత్ కార్యాచరణపై ఓ స్పష్టతతో ఉన్నారని సమాచారం. అందుకే వచ్చే యూపి అసెంబ్లీ ఎన్నికల నాటికి ప్రియాంకను బలమైన నేతగా తయారు చేయాలని చూస్తున్నారు. అధ్యక్షుడిగా రాహుల్, ఎంపిగా ప్రియాంక ..ఇలా ఇద్దరినీ కాంగ్రెస్ వారసత్వ రాజకీయాల్లో ప్రతిష్టింప చేయడం ద్వారా రానున్న సవాళ్లను ఎదుర్కోవాలన్నది సోనియా వ్యూహంగా ఉందన్న ప్రచారం ఉంది. మొట్ట మొదటిసారి రాయ్‌బరేలీలో నాటి కాంగ్రెస్ పార్టీ నేత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పోటీ చేసి నాటి భారతీయ లోక్‌దల్ పార్టీకి చెందిన రాజ్ నారాయణ్ చేతిలో 1977లో ఓడిపోయారు. అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ అక్కడి నుంచి లోక్‌సభకు పోటీ చేస్తూనే ఉంది. 1996, 1998లో మాత్రం బీజేపీ రాయ్‌బరేలీలో విజయం సాధించింది. తొలిసారి 1999 కెప్టెన్ సతీష్ శర్మను బరిలోకి దించి విజయాన్ని సొంతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆ తర్వాత ఆ స్థానాన్ని తమకు కంచుకోటగా మార్చుకుంది. 2004లో తొలిసారి సోనియాగాంధీ రాయ్‌బరేలీ బరిలోకి దిగి భారీ విజయం సొంతం చేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి లోక్‌సభ ఎన్నికల్లో ఆమెనే పై చేయి సాధించి రాయ్ బరేలీ అంటే కాంగ్రెస్‌కు కంచుకోట అనేట్లుగా మార్చారు. 2019లో కూడా సోనియా విజయం సాధించి ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. దీంతో ఇది కాంగ్రెస్‌కు సేఫ్ ప్లేస్. బీజేపీకి గత ఎన్నికల్లో స్మృతి ఇరానీని పెట్టి అమేథిని సొంతం చేసుకుంది. ఈ రెండు నియోజక వర్గాలు కాంగ్రెస్ పార్టీవే అనే ముద్ర వేసుకున్నాయి. ఇప్పుడు సోనియా రాజకీయాల నుంచి తప్పుకుంటే రాయ్‌బరేలీలో బరిలోకి దిగేదెవరు అని ప్రశ్న ఉదయిస్తోంది. ప్రియాంకను బరిలోకి దింపుతారన్నది పరోక్ష సంకేతాలు ఇస్తున్నారు. పార్లమెంట్‌కు ప్రియాంను తీసుకుని వచ్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ దశలో రాజ్యస భకు తీసుకుని వచ్చే ఆలోచన కూడా చేస్తున్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజం కోసం పాటుపడదాం..

సూర్యాపేట, మార్చి 2: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం మన నుంచే మార్పు మొదలవ్వాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకాన్ని వదిలేసి, భూమాతను కాపాడుకుందామని మంత్రి తెలిపారు. మంత్రి పిలుపు మేరకు సూర్యాపేట టీఆర్ఎస్ యువత ముందడుగు వేసి, అందుకై కృషి చేస్తున్నారు. పట్టణంలో వారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తూ.. పట్టణ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వేల రూపాయలు ఖర్చు చేసి, ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మంత్రి ఆదేశం మేరకు వారు తొలగించారు. సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణమ్మ, వైస్ చైర్మన్ కిశోర్‌ల ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన అన్ని ఫ్లెక్సీలను వారు తొలగిస్తున్నారు.

# శరణార్థులందరికీ పౌరసత్వం



కోల్‌కతా, మార్చి 2: పొరుగున ఉన్న మూడు దేశాల శరణార్థులకు పౌర చట్టాన్ని కల్పించాలన్న తమ ప్రభుత్వ నిర్ణయాన్ని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎంతమాత్రం అడ్డుకోలేరని కేంద్ర హోం మం త్రి అమిత్ షా ఆదివారం నాడు ఇక్కడ జరిగిన ఓ భారీ ర్యాలీలో స్పష్టం చేశారు. దేశంలోని శరణార్థులందరికీ పౌరసత్వాన్ని కల్పిం చే వరకూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం విశ్రమించే ప్రస క్తే లేదని ఆయన అన్నారు. పశ్చి మ బెంగాల్ అసెంబ్లీకి వచ్చే ఏడా ది జరుగనున్న ఎన్నికల్లో మూడిం ట రెండు వంతుల మెజారిటీతో బీజేపీ అధికారంలో వస్తుందనిఅమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. దేశంలోని శరణార్థులు, మైనారిటీలను రాష్ట్రంలోని అధికార తృణమూల్ కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. పౌరసత్వ చట్టం వల్ల దేశంలోని ఏ పౌరుడి పౌరసత్వం తొలగిపోదని ఆయన ఉద్ఘాటించారు. ఈ చట్టంలో ఈ విషయం చాలా స్పష్టంగా ఉన్నప్పటికీ ప్రతిపక్ష పార్టీలు మాత్రం మైనారిటీలను భయోత్పాతానికి గురిచేస్తున్నాయని ఆరోపించిన ఆయన 'మైనారిటీలు ఈ చట్టం పట్ల ఏవిధంగానూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇది పౌరసత్వాన్ని కల్పించేదే తప్ప లాక్కునేది కాదు' అని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సీఏఏను వ్యతిరేకించడం ద్వారా పశ్చిమ బెంగాల్‌లో అల్లర్లకు ఊతాన్ని ఇచ్చారని ఆయన అన్నారు. మమతా బెనర్జీ ఎంతగా వ్యతిరేక ప్రచారం చేసినా అల్లర్లను, రైళ్లు తగలబెట్టడాన్ని ప్రోత్సహించినా ఈ చట్టాన్ని ఎంతమాత్రం అడ్డుకోలేరని తెలిపారు. అయితే, ఈ రకమైన ప్రతికూల ప్రచారం ద్వారా మమతా బెనర్జీ శరణార్థుల ప్రయోజనానికి భంగం కలిగిస్తున్నారని అన్నారు. దేశంలోని ఏ పౌరుడూ ఈ చట్టం నిజాయితీని సందేశించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ సందర్భంగా 'ఇంకెంతమాత్రం అన్యాయం సాగదు' అన్న ప్రచారాన్ని కూడా ఈ ర్యాలీలో ఆయన ప్రారంభించారు. అయోధ్యలో కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే అత్యంత అద్భుతమైన రీతిలో రామాలయం ఆవిష్కృతం కాబోతోందని అమిత్ షా తెలిపారు. విమానాశ్రయం నుంచి అమిత్ షా ర్యాలీ జరిగిన మైదానం వరకు జరిగిన ప్రదర్శనలో బీజేపీ కార్యకర్తలు 'గోలీ మారో' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్ ప్రజలు 18 సీట్లను బీజేపీకి అప్పగించారని గుర్తు చేసిన అమిత్ షా 'మాకు డిపాజిట్లు కూడా రావని అప్పట్లో మమతా బెనర్జీ అన్నారు. కానీ ఆమె అంచనాలు తలకిందులు చేస్తూ 18 సీట్లు గెలుపొందాం. ఆ విధంగా 2 కోట్లకు పైగా బెంగాల్ ఓట్లను బీజేపీ కైవశం చేసుకుంది. 2021లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లోనూ మాదే స్పష్టమైన మెజారిటీ' అని అమిత్ షా అన్నారు.

## ఆక్వా ద్వారా 40శాతం విదేశీ మారకం

### రైతులను ప్రోత్సహిస్తున్న జగన్ ప్రభుత్వం: మోపిదేవి

భీమవరం,మార్చి2(ఆర్‌ఎన్‌ఎ): విదేశీమారక ద్రవ్యం 40 శాతం ఆక్వారంగం నుంచి వస్తుందని, ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి మోపిదేవి వెంకట రమణ అన్నారు. భీమవరంలో మెరైన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతోపాటు రూ.20 కోట్లతో బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని అన్నారు. దేశంలో గుజరాత్ తర్వాత భీమవరం ఆక్వాకు సెంట్రల్ హబ్‌గా ఉందన్నారు. ప్రతి జిల్లాలో మేజర్ ఫిషింగ్ జెట్టీ, రెండు మైనర్ జెట్టీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లాలో నర్సాపురం నియోజ కవర్గంలో రూ.20 కోట్లతో బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామన్నారు. ఇక్కడ రైతులు కష్టపడే తత్వం ఉన్నవారు కావడంతో ఆక్వారంగం అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో తొమ్మిది జిల్లాల్లో వెయ్యి కిలోమీటర్లు మేర తీరప్రాంతం ఉందని, ఆక్వా హాబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆక్వారంగానికి అందించే విద్యుత్ యూనిట్ ధర గతంలో ఒక యూనిట్‌కు మూడుగా ఉందని, సిఎం జగన్ దాన్ని రూ.1.50 పైసలకు తగ్గించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 48 ఇంటిగ్రేటెడ్ ఆక్వాల్యాబ్‌లు ఏర్పాటు చేయడానికి సిఎం జగన్ నిర్ణయం తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో అయిదు చోట్ల మేజర్ జెట్టీలు ఏర్పాటు చేసి మత్స్యసంపదను మరింత పెంచడానికి, మార్కెట్‌కు వచ్చేలా ప్రకాశం, నెల్లూరు, తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఒక్కో మేజర్ జెట్టీకి రూ.300 కోట్లు వ్యయమవు తుందన్నారు.పశ్చిమగోదావరి జిల్లాలో వ్యవసాయంతోపాటు ఆక్వారంగం అభివృద్ధి చెందిందన్నారు. అయితే వ్యవసాయానికి ఇబ్బందులు కలగకుండా ఆక్వా ఉత్పత్తులు పెంచుకోవాలన్నారు. నర్సాపురం నియోజ కవర్గంలో ఆక్వా, పర్యాటకరంగాలను మరింత అభి వృద్ధి చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచాల నేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. పలువురు వేగవంతమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

## బాలికకు నిప్పు పెట్టిన ఘటనపై మంత్రి సత్యవతి సీరియస్



మహబూబాబాద్, మార్చి 2: బాలికపై అత్యాచారం చేసి పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన ఘాతుకంపై రాష్ట్ర మహిళా-శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. ఈ ఘాతుకంపై సూర్యాపేట జిల్లా ఎస్పీతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా పెట్రోల్ పోసి నిప్పంటించిన యువకుడు వెంకటేశ్ పై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

బాలికలు, మహిళల పట్ల ఇలాంటి దారుణాలు జరగకుండా పోలీసు శాఖ మరింత అప్రమత్తంగా పనిచేయాలని, అవగాహనా చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళల పట్ల ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిని వదిలే ప్రసక్తి లేదని, ఇలాంటి సంఘటనలకు తావు లేదని, పునరావృతం కాకుండా చర్యలు చేపడుతామని చెప్పారు. మంటల్లో కాలి, గాయాలపాలై వరంగల్ ఎంజీఎం దవాఖానాలో చికిత్స పొందుతున్న బాలికకు అయ్యే ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందని, మెరుగైన వైద్యం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆ బాలిక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. గుగులోతు వెంకటేశ్ అనే యువకుడు ప్రేమ పేరుతో ఓ బాలికను వేధించి, అత్యాచారం చేసి, ఆపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలో జరిగింది.

# సహకార బ్యాంక్‌ను బలోపేతం చేస్తా

### కమర్షియల్ బ్యాంకుల్లా లాభాల్లోకి తెస్తా

### గత అవకతవకలపై కఠిన చర్యలు తప్పవు: ఛైర్మన్

వరంగల్,మార్చి2(ఆర్‌ఎన్‌ఎ): గత పాలవర్గం చేసిన అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు స్పష్టం చేశారు. అలాగే డీసీసీబీని లాభాల్లోకి తీసుకొస్తామన్నారు. రైతాంగానికి మరింత చేరువలా బ్యాంక్ కార్యకలాపాలు విస్తరించేలా పటిష్టమైన కార్యాచరణతో వెళ్లడమే తమ ముందున్న తక్షణ కర్తవ్యంగా పేర్కొన్నారు. వరంగల్ డీసీసీబీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ సహ ఎమ్మెల్యేలందరూ తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా నిజాయితీగా పనిచేస్తామని అన్నారు.

గత పాలకులు చేసిన అవి టనీతికి ఇప్పటికే ప్రభుత్వ పరంగా సమగ్ర విచారణ జరిగిందని, అయితే వాటిపై కొత్త పాలకవర్గం విధానపరమైన నిర్ణయం తీసుకొని చర్యలు చేపడతామని ఆయన వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రుణమాఫీతో చిన్న, సన్నకారు రైతులు రుణాలు తిరిగి చెల్లిస్తున్నా, పెద్దరైతులు మాత్రం చెల్లింపుల్లో నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. అయితే తమ పాలకవర్గం లోతుగా చర్చించి దీనిపై సమగ్ర కార్యాచరణతో ముందుకెళతామని ఆయన పేర్కొన్నారు. ఖాతాదారులకు బ్యాంక్‌పై విశ్వసనీయత పెరిగేలా పనిచేస్తామని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రోత్సాహం, రైతును రాజు చేయడమే ధ్యేయంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత బలంగా ముందుకు తీసుకుని వెళతామని అన్నారు. డీసీసీబీ ద్వారా రైతులకు మరింత విస్తృతమైన సేవలు అందించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని బ్యాంక్‌ను గాడిలో పెట్టడం తక్షణ కర్తవ్యం అన్నారు. సహకార వ్యవస్థ నిర్వీర్యమై పోయిందన్న భావన పూర్తిగా తొలగించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. అయితే బ్యాంక్ చరిత్రలో మునుపెన్నడూలేనివిధంగా గత పాలకవర్గాలు వ్యక్తిగత ప్రయోజనాల కోసం అనుసరించిన విధానాల వల్ల కొన్ని చోట్ల ఇబ్బందులు జరిగాయి. కొన్ని సొసైటీలు లాభాల్లో ఉన్నాయి. కొంతమంది వల్ల కొన్ని సొసైటీలు నిర్వీర్యం అయ్యాయన్న అపవాదు ఉంది. దానిని తొలగించడం, బ్యాంక్‌పై రైతుల్లో నమ్మకాన్ని కలిగించడం ముఖ్యమన్నారు. కష్టపడి పనిచేసి ఇతర కమర్షియల్ బ్యాంకుల మాదిరిగా డీసీసీబీని గాడిలో పెట్టాలని భావిస్తున్నట్లు వెల్లడించారు.

# జిల్లాలో ఇంటర్,టెన్త్ పరీక్షల ఏర్పాట్లు పూర్తి

### పటిష్ట భద్రత ఏర్పాటు చేసిన అధికారులు

### పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

ఆదిలాబాద్,మార్చి2(ఆర్‌ఎన్‌ఎ): ఇంటర్మీడియెట్,టెన్త్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేశారు. 4నుంచి ఇంటర్ 19 నుంచి టెన్త్ పరీక్షలు జరుగనున్నాయి. వీటిని పక్కాగా నిర్వహించేలా కలెక్టర్ శ్రీ దేవసేన అధికారులతో సమీక్షించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మార్చి4 నుంచి 23 వరకు నిర్వహించే ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించాలని సూచించారు. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ఇన్విజిలేటర్స్ నిబంధనలు తెలుసుకోవాలన్నారు. ఆందోళన చెందుతున్న విద్యార్థులకు మనోధైర్యాన్ని ఇవ్వాలన్నారు. జవాబు పత్రాలను రోజువారీగా ప్యాకింగ్ చేసి పోస్టుద్వారా పంపించాలన్నారు.

ఇదిలావుంటే ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి అన్నారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చూస్తామని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో కూడా ఎలాంటి కాపీయింగ్ జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని రకాల చర్యలు చేపట్టామని చెప్పారు. గత ఏడాది 95.77శాతం ఉత్తీర్ణత సాధించామని, ఈ ఏడాది వంద శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. పదో తరగతి పరీక్షలు ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం అయి,ఏప్రిల్ ఒకటిన చివరి పరీక్షతో ముగుస్తాయి. జిల్లా నుంచి ఈ ఏడాది రెగ్యులర్‌గా 5,097 మంది బాలురు, 5,282మంది బాలికలు, ప్రైవేటుగా 439 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా మొత్తం 51 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. రెగ్యులర్ విద్యార్థుల కోసం 48 పరీక్ష కేంద్రాలు, ప్రైవేట్ విద్యార్థుల కోసం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్షలు రాయకుండా చర్యలు తీసుకుంటున్నారు.ప్రశ్నపత్రాలు రెండు మూడు రోజుల్లో జిల్లాకు రానున్నాయి. వాటిని ఆయా పరీక్ష కేంద్రాలకు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లలో భద్రపరుస్తారు అక్కడి నుంచి పరీక్ష రోజు ఆయా సబ్జెక్టుల ప్రశ్నపత్రాలను సీఎస్, డీవోలు, కస్టోడియన్‌లు తీసుకువెళ్తారు. ప్రతి విద్యార్థికీ హాల్‌టికెట్ ఇవ్వాలని, ఎక్కడైనా ఇబ్బందులు పెడితే వెంటనే ఎంఈవో, డీఈవో కార్యాలయంలో సంప్రదిస్తే హాల్‌టికెట్లు ఇచ్చేలా ఏర్పాటు చేస్తాం. ఆన్‌లైన్ నుంచి తీసుకున్న హాల్‌టికెట్లను పరీక్ష కేంద్రాల్లో అనుమతించేలా కూడా తగిన చర్యలు తీసుకుంటున్నారు. పది పరీక్షా కేంద్రాలకు వంద మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నారు. . విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులున్నా కంట్రోల్ రూమ్‌లో సంప్రదించాలన్నారు.

# అసంఘటిత రంగం బలపడాలి

### కార్మిక చట్టాలకు పదును పెట్టాలి

### కార్మిక సంఘాల అభిప్రాయం

హైదరాబాద్,మార్చి2(ఆర్‌ఎన్‌ఎ): అసంఘటిత కార్మికులకు సమగ్ర ప్రయోజనాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నేతలు సూచిస్తున్నారు. అందుకువీలుగా ప్రస్తుత చట్టాల్లో సంస్కరణలు తేవాల్సి ఉందన్నారు. అలాగే చట్టాలను కఠినంగా అమలు చేస్తేనే వీరికి ప్రయోజనం కలుగుతుంది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను, యాజమాన్యాలను, లబ్ధిదారులను ఇందులో భాగస్వాములను చేయాలని కోరుతున్నారు. 2004లో అసంఘటిత కార్మికుల కమిషన్ ఏర్పాటైనా, అది మొక్కుబడిగానే మిగిలింది. కార్మికులందరిని ప్రభుత్వపరంగా నమోదు చేసి, అన్ని పథకాల పరిధిలో చేర్చాలి. దేశంలోని 39 కోట్ల అసంఘటితరంగ కార్మికుల్లో కేవలం తొమ్మిది కోట్ల మందే వివిధ పథకాల కింద నమోదై ఉన్నారు.

అందరికీ అన్ని ప్రయోజనాలు చేకూర్చడం వల్ల వారితో పాటు దేశానికీ మేలు జరుగుతుంది. అందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి పని భద్రత కల్పించాలి. కనీస వేతనాలు కచ్చితంగా అందేలా చూడాలి. సామాజిక భద్రత కింద పింఛన్, పిల్లలకు విద్యాసదుపాయం ఉపకార వేతనాలను మంజూరు చేయాలి. వివాహ సమయాల్లో సాయం అందించాలి. మహిళా కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆరోగ్య బీమా పథకాన్ని కార్మికులందరికీ విస్తరించాలి. సార్వత్రిక సంఖ్యతో వారికి స్మార్ట్‌కార్డులు అందుబాటులోకి రావాల్సిఉంది. వేతనాలు బ్యాంకు ద్వారా చెల్లించే ఏర్పాట్లు చేయాలి. అసంఘటిత రంగ కార్మికులు నేరుగా వేతనాలు పొందలేని పరిస్థితి ఏర్పడింది. బ్యాంకు ఖాతాలు లేకపోవడం సమస్యగా మారింది. వారందరి పేర్లు నమోదై, నగదు రహిత సేవలు అందుబాటులో ఉంటే ఎలాంటి సమస్యలు ఉండేవి కావు. కొత్తగా పనులు పొందడానికి వారు ఇబ్బందులు పడుతున్నారు. వీటన్నింటిని కేంద్రప్రభుత్వం గుర్తించి, వారికోసం పెద్దయెత్తున బ్యాంకు ఖాతాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వాల తరపున జిల్లా కలెక్టర్లు, ప్రధాన బ్యాంకు మేనేజర్లు, కార్మిక శాఖ అధికారులు ఇందులో పాల్గొని కార్మికులను చైతన్యపరచాలి. కేవలం మొక్కుబడిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించకుండా కార్మికహితం కోసం దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఎలాంటి ఆంక్షలు లేకుండా వారందరికీ బ్యాంకు ఖాతాలివ్వాలి. అవసరమైతే ఇంటింటికీ తిరగాలి. బ్యాంకు ఖాతాలతో పాటు వారి సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుంబిగించాలి. ఇందుకోసం బలమైన వ్యవస్థను రూపొందించాలని కోరుతున్నారు.

# పరిశుభ్రతతోనే రోగాలు దూరం



నిర్మల్, మార్చి2: 'మన ఇల్లు మన వీధి మన పట్టణం' అనే భావనతో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర అటవీ పర్యావరణ న్యాయ దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్ర కరణ్ రెడ్డి అన్నారు. ఆదివారం నిర్మల్ పట్టణంలోని జొహ్రనగర్ ఎంసిహెచ్ ప్రసూతి ఆస్పత్రి పక్కన గల ఖాళీ స్థలంలో చేపట్టిన శ్రమదానం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ మన ఇల్లు మన వీధి మన పట్టణం అనే భావన కలిగి ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే రోగాలు దరిచేరవని అన్నారు. విదేశాలలో రోడ్డు మీద చెత్త వేస్తే జరిమానా విధిస్తారని అందువల్ల అక్కడ రోడ్ల మీద ఎవరూ కూడా చెత్త వేయరని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో 30 రోజుల పాటు పల్లె ప్రగతి కార్యక్రమం చేపట్టి ప్రతి గ్రామాన్ని పచ్చదనం పరిశుభ్రతతో కళకళలాడేలా చేశారన్నారు.

పట్టణాలలో కూడా పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపొందించేందుకు ఫిబ్రవరి 24 నుంచి మార్చి 4 వరకు పట్టణ ప్రగతి కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.

పరిశుభ్రత ఉంటే ఎలాంటి రోగాలు దరిచేరవని ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. పట్టణ అభివృద్ధికి ప్రజల తోడ్పాటు అవసరమన్నారు.

మున్సిపల్ చైర్మన్, కమిషనర్, మున్సిపల్ కార్యాలయం సిబ్బంది అటెండర్ నుంచి అధికారి స్థాయి వరకు పట్టణ ప్రగతి శ్రమదానంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇదే కాన్సెప్ట్ తో రాష్ట్ర వ్యాప్తంగా శ్రమదానం కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అనంతరం మంత్రి ప్రసూతి ఆస్పత్రిలోని పలు వార్డులను సందర్శించారు. ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ వార్డులో ఉన్న రోగులను కలిసి వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కాన్పుల విభాగంలో సందర్శించి బాలింతలకు కేసీఆర్ కిట్లు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముషారఫ్ ఫారుఖీ, మున్సిపల్ చైర్ పర్సన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏరవోతు రాజేందర్, ఎఫ్ ఎస్ సి ఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సాజిద్, కౌన్సిలర్ మహమ్మద్ సలీం, జిల్లా ఆస్పత్రి డాక్టర్ సురేష్, ప్రసూతి ఆసుపత్రి ఆర్ ఎం ఓ డాక్టర్ రజని , ఎలక్ట్రిసిటీ ఎస్ ఈ చౌహన్, మున్సిపల్ కమిషనర్ ఎన్ బాలకృష్ణ, పట్టణ ప్రగతి సూపర్ వైజర్ కోటేశ్వరరావు, మున్సిపల్ అధికారి ఈ సంతోష్ కుమార్, వైద్యాధి కారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 2న టీఎస్ బీపాస్ ప్రారంభం: మంత్రి కేటీఆర్

ఖమ్మం, మార్చి 2: మూడు నెలల్లో ఖమ్మం పట్టణంలో 400 పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని మంత్రి కేటీఆర్ అధికారులకు సూచించారు. ప్రతి డివిజన్‌లో హరితప్రణాళిక తయారు చేసుకోవాలని చెప్పారు. నాటిన మొక్కల్లో 85శాతం బతకకపోతే కార్పొరేటర్ల పదవులు పోతాయని హెచ్చరించారు. ఖమ్మం పట్టణ ప్రగతి కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి పనుల్ని మంత్రులు ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, పువ్వాడ అజయ్‌తో కలిసి కేటీఆర్ ప్రారంభించారు.'ఖాళీ స్థలాల్లో చెత్త, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రం చేయాలి. కొత్త పార్కుల నిర్మాణం, ఉన్న పార్కులను అభివృద్ధి చేయాలి.

వాటర్ ఆడిట్‌ను నిర్వహించాలి. ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని పూర్తిగా నివారించాలి. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో చూద్దామన్నా..చెత్త కనిపించదు. 75 గజాల్లోపు ఇంటి నిర్మాణానికి అనుమతి అవసరం లేదు. 600 గజాల వరకు ఇంటి నిర్మాణానికి ఆన్‌లైన్‌లోనే అనుమతి మంజూరు చేస్తాం. అనుమతుల కోసం ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వనవసరం లేదు. భవన నిర్మాణ అనుమతుల కోసం ఏప్రిల్ 2న టీఎస్ బీపాస్ పథకం ప్రారంభిస్తామని' వివరించారు.'నిబంధనలు అతిక్రమిస్తే నిర్మాణాలు కూల్చేస్తాం..25 రెట్ల జరిమానా విధిస్తాం. ప్రతినెల కార్పొరేషన్ సమావేశం, మూడు నెలలకు డివిజన్ సమావేశం ఉంటుంది. ప్రతి కార్పొరేటర్ ఒక్కొక్క కేసీఆర్ అయితే పట్టణం మారుతుంది. ప్రజాప్రతినిధుల ఉద్యోగాలు పోవడం చట్టంలోనే ఉంది.. ఎవరూ మార్చలేరు. పార్కులు, పచ్చదనానికి 10శాతం నిధులు కేటాయించాలి. ప్లాస్టిక్‌ను దూరం చేయండి..జూట్ సంచులు అందించండి. మున్సిపల్ చట్టం ప్రకారం సిబ్బంది ఉదయం 5:30 గంటలకు విధుల్లో ఉండాలని' కేటీఆర్ పేర్కొన్నారు.

# సంఘటిత శక్తితోనే అద్భుతాలు



ఖమ్మం, మార్చి 2: ప్రజలంతా సంఘటితంగా సహకరిస్తే అద్భుతాలు సృష్టించవచ్చని, తమ ఇంటితో పాటు గల్లీ కూడా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందని రాష్ట్ర ఐటీ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. ఆదివారం ఖమ్మం పర్యటనలో భాగంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఖమ్మం నగరంలో పలుచోట్ల నేరుగా ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పనితీరు, స్థానిక సమస్యలపై ఆరాతీశారు. నూతనంగా అధునాతన సాంకేతికతతో నిర్మించిన వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను ప్రారంభించిన అనంతరం కార్పొరేటర్లు, అధికారులు, డివిజన్ కమిటీలతో నిర్వహించిన సమావేశంలో ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో 4వ పెద్ద నగరంగా ఉన్న ఖమ్మంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని మంత్రి కేటీఆర్ చెప్పారు. అయితే అభివృద్ధితోనే సమస్య పరిష్కారం కాదని, అందుకే పల్లెప్రగతి స్ఫూర్తితో పట్టణ ప్రగతి కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రభుత్వ ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలంతా ఐక్యంగా సహకరిస్తే అద్భుతాలు సృష్టించి దేశంలో తెలంగాణను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దవచ్చన్నారు. పట్టణ ప్రగతి ద్వారా రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అధికారులు, కార్పొరేటర్లు నాలుగు ప్రధాన అంశాలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ఆయా డివిజన్‌లలో శానిటేషన్ ప్లాన్, హరిత ప్రణాళిక, ఇంటింటికీ నల్లా, ఖాళీ స్థలాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ఈ నెల 4న పట్టణ ప్రగతి ముగియనుందని, ఆలోగానే డివిజన్ వారీగా ఈ నాలుగు అంశాలపై అధికారులు, కార్పొరేటర్లు నివేదిక తయారుచేసి 6న హైదరాబాద్‌లో జరిగే సమావేశంలో అందించాల్సి ఉంటుందన్నారు. ప్రతి పట్టణంలో ప్రతి వెయ్యి మందికి ఒక పబ్లిక్ టాయిలెట్ ఉండాలని, అందులో సగం మహిళల కోసం కేటాయించాలని, జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి వాటి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేయాలని, సిరిసిల్ల తరహాలో పొడి చెత్త ద్వారా మహిళలు ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉందన్నారు. ఆరోగ్యకరమైన పట్టణాలు తయారైతే సమస్యలు తీరినట్లేనని, ఇందుకోసం

ప్రతి నగరంలో పందులు, వీధికుక్కలు, దోమలు ఉండకుండా చూడాలన్నారు. ఆయా డివిజన్లలో చెత్త బయట పడవేయకుండా, మొక్కలు భారీగా నాటి వాటిని పరిరక్షించేలా ప్రజల్లో చైతన్యం తెచ్చి తీర్మానాలు చేయించాలన్నారు. మరో ఏడాదిలోగా కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కార్పొరేటర్లకు ఇది పరీక్ష అని, నిబంధనలు పాటించకుండా ప్రజాసమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మళ్లీ టిక్కెట్ ఇచ్చేది లేదన్నారు. ఏప్రిల్ 2నుంచి టీఎస్ బీపీఎస్ అమలులోకి వస్తుందని, 75గజాల లోపు స్థలంలో ఇల్లు కడితే అనుమతి అవసరం లేదని, 600 గజాల లోపు స్థలంలో అయితే సొంత పూచీకత్తుపై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి 21రోజుల్లోగా అనుమతి పొందవచ్చన్నారు. ఇందుకోసం ఎవరినీ కలవాల్సిన అవసరం లేదన్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఇల్లు కడితే కచ్చితంగా కూల్చివేస్తామని హెచ్చరించారు. నూతన మున్సిపల్ చట్టంలోని ముఖ్యమైన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎవరి పైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే ప్రయత్నం చేస్తే శిక్ష తప్పదన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పావలా శాతం పనిమాత్రమే పూర్తయిందని, మిగిలి దానికోసం శ్రమించాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందుబాటులోకి తెచ్చామని, అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా ఉన్నామన్నారు. నిధులు ఉన్నాయని, విధులు బాధ్యతతో నిర్వర్తించినప్పుడే విజయవంతం అవుతామన్నారు. మున్సిపల్ బడ్జెట్‌లో 10శాతం పచ్చదనానికి కేటాయించాలని స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలో పువ్వాడ అజయ్‌కుమార్ నేతృత్వంలో అనేక మంది సహకారంతో గతంలో సైకిల్‌ను తొక్కేసి, ఇప్పుడు పర్యావరణ పరిరక్షణ కోసం సైకిల్ తొక్కుతున్నారని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, శ్రీనివాస్ గౌడ్, వేముల ప్రశాంతరెడ్డి, ఎంపీ నామా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## నల్లచట్టాలపై పోరాటం తప్పదు

### పిడిఎఫ్ ఎంఎల్సి కెఎస్.లక్ష్మణ రావు

కాకినాడ,మార్చి2(ఆర్‌ఎన్‌ఎ): ప్రపంచంలో ఏ దేశంలోనూ పౌరసత్వాన్ని మత ప్రాతిపదికన ఇవ్వలేదని పిడిఎఫ్ ఎంఎల్సి కెఎస్.లక్ష్మణ రావు అన్నారు. 857 సిపాయుల తిరుగుబాటులో హిందు, ముస్లిం కలిసి చేసిన పోరాటం బ్రిటిష్ వారిని గడగడలాడించిందన్నారు. అప్పటి నుంచి బ్రిటిషు వారు హిందు, ముస్లింలను విడగొట్టి విభజించు పాలించు విధానాన్ని ప్రారంభించారన్నారు. నేటి బిజెపి ప్రభుత్వం కూడా ఇదే పద్ధతిని పాటిస్తుందన్నారు. సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్‌లను తీసుకొచ్చి హిందు, ముస్లింల మధ్య విద్వేషాలను తెచ్చే ప్రయత్నం చేస్తుందన్నారు. నల్లచట్టాలకు వ్యతిరేకంగా కోట్లాది మంది ప్రజలు రోడ్లపైకొచ్చి పోరాటం చేస్తున్నారన్నారు. రాజ్యాంగం ప్రాథమిక హక్కులను ఆర్టికల్ 14 సమానత్వపు హక్కును, ఆర్టికల్ 15 కుల,లింగ, మత వివక్షలేకుండా సమానత్వంగా అందరికీ రాజ్యాంగ ఫలాలు అందాలని చెబుతుందన్నారు. కాని బిజెపి ప్రభుత్వం ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా సిఎఎను తీసుకొచ్చిందన్నారు. పౌరసత్వ చట్టం 1955లో తీసుకొచ్చినప్పటికీ కొన్ని పరిస్థితుల రీత్యా అస్సాంలో మాత్రమే ఎన్ఆర్‌సిని అమలు చేయాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసినప్పటికీ కోర్టు దిక్కారణ చేస్తూ 2024కి భారతదేశంలో ఎన్ఆర్‌సిని అమలు చేసి తీరుతామని కేంద్ర మంత్రులు చెబుతున్నారన్నారు. ఒక అస్సాంలో ఎన్ఆర్‌సి అమలు కోసం రూ.1,200 కోట్లు కేటాయించాల్సి వచ్చిందన్నారు. పౌరసత్వం అనేది పుట్టుక, రక్త సంబంధం ద్వారా, నమోదు ద్వారా మాత్రమే ఉండాలి కానీ మత ప్రాతిపదికన చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాజ్యాంగంపై జరుగుతున్న దాడిని ప్రతిఘటించాలని, రాజ్యాంగాన్ని కాపాడు కోవాలన్నారు. నేటి యువత రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలన్నారు.

## భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

### –బడ్జెట్ కేటాయింపులు పెరగాలి: సిఐటియూ

విజయవాడ,మార్చి2(ఆర్‌ఎన్‌ఎ): భవన నిర్మాణ రంగం కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సాయిబాబు కోరారు.

రాష్ట్రంలో సెస్ ద్వారా సంక్షేమ బోర్డులో ఉన్న నిధులు కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయకుండా ఇతర రంగాలకు మళ్లిం చడం సరికాదన్నారు. ఈ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించొద్దన్నారు. సిమెంట్, ఐరన్, రంగులు, ఇతర ముడి సరుకుల ధరలు నియంత్రించి వాటిని ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు 18 రకాల విభాగాల్లో పని చేస్తున్నారని తెలిపారు. అందులో 8 లక్షల మంది కార్మికుల పేర్లు మాత్రమే సంక్షేమ బోర్డులో నమోదై ఉన్నాయని చెప్పారు. ఇసుక పాలసీపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపిలో ఇసుక దొరక్క పనులు లేక భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల పోషణ భారమై అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరికొంత మంది వలసలు పోతున్నారన్నారన్నారు. అడ్డాల ఏర్పాటు, ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన లేబర్ శాఖ అధికారులు చోద్యం చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమబోర్డు ద్వారా కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పెట్టుబడిదారులు, బడా వ్యాపారులకు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం కార్మికులకు మాత్రం కూలి పెంపు, రుణాలివ్వడం లేదన్నారు.

## ఒక్కో కాంగ్రెస్ ఎమ్మెల్యేకు 35 కోట్ల లంచం!

న్యూఢిల్లీ, మార్చి 2 : మధ్యప్రదేశ్ మాజీ సీఎం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దిగ్విజయ్ సింగ్ భారతీయ జనతా పార్టీ నాయకులపై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలను కొనేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తుందని, ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 35 కోట్ల లంచం ఇచ్చేందుకు సిద్ధమవుతుందని దిగ్విజయ్ పేర్కొన్నారు. సీఎం కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు మాజీ సీఎం, బీజేపీ నాయకులు శివరాజ్‌సింగ్ చౌహాన్, నరోత్తమ్ మిశ్రా ప్రణాళికలు రచిస్తున్నారని తెలిపారు. పదిహేను ఏండ్లు రాష్ట్రాన్ని దోచుకున్నారు. ఇప్పుడు ప్రతిపక్షంలో కూర్చోవడానికి బీజేపీ నేతలకు ఇష్టం లేదు. అందుకే బహిరంగంగానే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను కొనేందుకు వారు ప్రయత్నాలు మొదలుపెట్టారని సింగ్ చెప్పారు.

# పనిచేయని కౌన్సిలర్లను తొలగిస్తాం: మంత్రి హరీశ్ రావు



మెదక్:, ఫిబ్రవరి 2(నేటినిజం ప్రతినిధి): నర్సాపూర్ పట్టణంలో అన్ని హంగులతో అత్యాధునిక వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, చేపల మార్కెట్‌తో పాటు రైతు బజార్ నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తామని, పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు.

ఆదివారం నర్సాపూర్ మున్సిపాలిటీలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు అభివృద్ధి పనులను మంత్రి పరిశీలించారు. నర్సాపూర్ ప్రజల చిరకాల కోరిక అయిన బస్‌డిపో నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి మూడు నెలల్లో అందుబాటులోకి తీసుకొచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీ సునీల్ శర్మను మంత్రి ఫోన్‌లో ఆదేశించారు.

నర్సాపూర్‌లో పట్టణంలో అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతి మహిళ తప్పనిసరిగా తడిపొడి చెత్తను వేరు చేయాలన్నారు. కొత్త మున్సిపల్ చట్టం ప్రజలకు అధికారులు, హక్కులు ఇచ్చిందన్నారు. పనిచేయని కౌన్సిలర్లను తొలగిస్తామని మంత్రి హెచ్చరించారు.

# జోరుగా కొనసాగుతున్న పట్టణ ప్రగతి

## పారిశుద్య పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్సీ పట్నం

వికారాబాద్,మార్చి 2(ఆర్ఎన్ఎ): పట్టణంలో నిర్వహించిన పట్టణ ప్రగతి కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్, ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం పనులను మహేందర్‌రెడ్డి, ఆనంద్ పరిశీలించారు. పట్టణంలో సుందరీకరణ, అభివృద్ధి కోసం మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌తో చర్చించి నిధులు మంజూరు చేయిస్తామని ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్ పాల్గొన్నారు. ఇదిలావుంటే మున్సిపాలిటీలను పరిశుభ్రత, పచ్చని పట్టణాలుగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమం జిల్లాలో జోరుగా కొనసాగుతున్నది. ఎమ్మెల్యేలు, అధికారుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. చెత్తాచెదారం, కంపచెట్ల తొలగింపుతో కాలనీలు పరిశుభ్రంగా మారుతున్నాయి. వికారాబాద్ మున్సిపాలిటీలో కలెక్టర్ పౌసుమి బసు పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని పారిశుద్ధ్యం, హరితహారంపై అవగాహన కల్పించారు. పరిగి మున్సిపాలిటీలో స్థానిక ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పర్యటించి మురుగు కాల్వలను పరిశీలించారు. ప్రగతి త్వరితగతిన చేపట్టాలని అధికారులకు సూచించారు. తాండూరు మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో కలెక్టర్ చంద్రయ్య, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటించారు.

వికారాబాద్ పట్టణంలో పట్టణ ప్రణాళికలో భాగంగా చేపడుతున్న పనులు ఉద్యమంలా కొనసాగుతున్నాయి. అధికారులు, పాలకవర్గ ప్రతినిధులు వార్డుల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నారు. వార్డులో ముళ్లపొదళ్లను జేసీబీ సహాయంతో తొలగించారు. మురుగు కాలువలను మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించారు. వార్డులోని ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకొని పారిశుద్ధ్యం, హరితహారంపై అవగాహన కల్పించారు. రహదారిని శుభ్రం చేయకపోవడం, మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడం పట్ల మున్సిపల్ సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీ స్థలాల్లో ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను వెంటనే

తొలగించాలని, మురుగు కాలువలను శుభ్రం చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజూల మాట్లాడుతూ పట్టణ ప్రగతిలో కాలనీవాసులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కాలనీలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ప్రగతి పనుల్లో భాగంగా మురికినాలల్లో పూడిక తీత, హరితహారంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ఏండ్లుగా పాడుబడ్డ భవనాలు ప్రమాదకరంగా ఉన్న వాటిని కాలనీవాసుల సూచనల మేరకు కూల్చివేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.




న్యూఢిల్లీలో క్యాన్సర్ అవేర్నెస్ కార్యక్రమాన్ని ప్రారంభించిన కేంద్రమంత్రులు హర్షవర్ధన్, స్మృతి ఇరానీ,

# వాడుకుని వదిలేసే రకం కెసిఆర్

## ఆయనకు శాశ్వత మిత్రులు ఉండరన్న వివేక్

హైదారాబాద్,మార్చి 2(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్‌ది వాడుకొని వదిలేసే మనస్తత్వమని బీజేపీ నేత, మాజీ ఎంపీ వివేక్ వెంకట్ స్వామి విమర్శించారు. అలాగే జగన్‌ను కూడా కేసీఆర్ అవసరానికి మాత్రమే వాడుకుంటున్నారని అన్నారు. కమిషన్ల కోసమే కేసీఆర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు కడుతున్నారని మండిపడ్డారు. తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా వివేక్ వెంకట స్వామి దర్శించుకున్నారు. మనవడు వీర్ వెంకటస్వామి పుట్టు వెంట్రుకల మొక్కు చెల్లించుకున్నామని చెప్పారు. తన తండ్రి కాకా పుట్టినరోజునే మనవడు కూడా పుట్టాడన్నారు. ఈ సందర ÷–భంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్, కేసీఆర్‌ల మైత్రిపై మాజీ ఎంపీ వివేక్ ఘాటైన విమర్శలు చేశారు. కేసీఆర్, జగన్ మిత్రులని అందరూ అనుకుంటున్నారని... కానీ అది నిజం కాదని వివేక్ వ్యాఖ్యానించారు. అసలు కేసీఆర్‌కు ఎవరూ శాశ్వత మిత్రులు ఉండరని ఆయన విమర్శించారు. కేసీఆర్ అందరినీ తన అవసరానికి వాడుకొని వదిలేస్తారని ఆరోపించారు. విషయాన్ని ఏపీ సీఎం జగన్ గుర్తు పెట్టుకుని ముందుకు సాగాలని ఆయన సలహా ఇచ్చారు. కేవలం కమిషన్ల కోసమే జగన్‌తో కేసీఆర్ స్నేహాన్ని కొనసాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. కుటుంబసభ్యులతో కలిసి తిరుమల చేరుకున్న వివేక్ వీఐపీ బ్రేక్ ప్రారంభ దర్శనం సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. తన మనవడు వీర్ వెంకటస్వామి కూడా తన తండ్రి వెంకటస్వామి పుట్టిన రోజే పుట్టారని... మనవడి పుట్టువెంట్రుకలు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నామని ఆయన తెలిపారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. వివేక్‌ను స్వామివారి వస్త్రంతో సత్కరించి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# అసోంలో దారుణ ఘటన

## బాలికను రేప్ చేసి ఉరేసిన తొటి విద్యార్థులు

గౌహతి,మార్చి 2(ఆర్ఎన్ఎ): అస్సాంలో దారుణం జరిగింది. 12 ఏళ్ల బాలికను అత్యాచారం చేసి.. ఓ చెట్టుకు ఉరి తీశారు. ఈఘటనలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న ఏడు మంది విద్యార్థులను అరెస్టు చేశారు. బిశ్వనాథ్ జిల్లాలోని చక్లా గ్రామంలో ఈ ఘాతుకం జరిగింది. ఘోపూర్ పోలీసులు ఈ కేసును విచారిస్తున్నారు. హెచ్ఎస్ఎల్‌సీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి చెప్పారు. పరీక్షలు పూర్తి అయిన నేపథ్యంలో.. ఇంట్లో పార్టీ చేసుకుందాం రావాలంటూ ఆ బాలికను ఆహ్వానించి.. ఆ తర్వాత అత్యాచారానికి పాల్పడ్డారు. శుక్రవారం రాత్రి రేప్ జరిగింది. అనంతరం

ఇంటికి సమీపంలో ఉన్న అడవిలో ఓ చెట్టుకు ఉరి వేశారు. ఆదివారం ఆ బాలిక శవం దొరికింది. దీనిపై రంగంలోకి దిగిన పోలీసులు విద్యార్థులను అరెస్ట్ చేశారు.

# రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

మేడ్చెల్,మార్చి 2(ఆర్ఎన్ఎ): మద్యం మత్తు.. కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఈ ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కీసర మండల కేంద్రానికి అనుబంధ గ్రామమైన వన్నెగూడ నివాసి వికలాంగుడు మంత్రాల నర్సింహ(40) కీసరగుట్ట ఆలయంలో ఆటెండర్. భార్య ఇద్దరు కుమారులున్నారు. అదే గ్రామానికి చెందిన రాయపురం కిష్టయ్య (55)కు భార్య ముగ్గురు కుమారులు, ఒక్క కుమార్తె ఉన్నారు. ఆదివారం సాయంత్రం మంత్రాల నర్సింహ, రాయపురం కిష్టయ్య బైక్‌పై భోగారం నుంచి కీసర వైపు వెళుతున్నారు. భోగారం గ్రామానికి చెందిన దుర్గం వెంకటేశ్ మద్యం మత్తులో కీసర నుంచి భోగారానికి కారులో వస్తున్నాడు. అతివేగంతో బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో నర్సింహ, కిష్టయ్య అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు కుటుంబీకులు, పోలీసులకు సమాచామిచ్చారు. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో ఇరుకుటుంబాల్లో విషాధ చాయలు అలుముకున్నాయి.

## రోడ్డు దాటుతూ మరొకరు మృతి

శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరు మృతి చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. ఒడిశా, గజపతి జిల్లాకు చెందిన బాలకృష్ణ, లక్ష్మి కుటుంబ సభ్యులతో కోంపల్లిలో నివాసముంటున్నారు.

కాగా, ఆదివారం ఉదయం కోంపల్లి నుంచి తుర్కపల్లి గ్రామం వెళ్లేందుకు బస్సు ఎక్కి.. తుర్కపల్లి వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతున్న క్రమంలో సిద్దిపేట నుంచి హైదారబాద్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలకృష్ణ తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైభాస్కర్ వివరించారు.

# పట్టణాల రూపురేఖలు మార్చేందుకే 'పట్టణప్రగతి': మంత్రి కేటీఆర్



భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 2: పట్టణాల రూపురేఖలు మార్చేందుకే ప్రభుత్వం.. పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఇవాళ మంత్రి.. ఇల్లెందు మున్సిపాలిటీలో పర్యటించి, అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 'పల్లెప్రగతి' కార్యాక్రమం విజయవంతమవడంతో.. ముఖ్యమంత్రి కేసీఆర్.. 'పట్టణప్రగతి' కార్యక్రమాన్ని చేపట్టారనీ, తద్వారా పట్టణాలను అభివృద్ధి చేసుకునేందుకు వీలుంటుందని మంత్రి తెలిపారు. రాబోయే నాలుగేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ప్రచార ఆర్భాటాలు, ఓటర్లను ఆకట్టుకోవడానికి జిమ్మిక్కులు చేయాల్సిన అవసరం లేదనీ.. రాష్ట్ర అభివృద్ధి పైనే ప్రభుత్వం దృష్టి సారించిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. పట్టణ ప్రగతిలో భాగంగా ప్రతి వార్డులో విరివిగా మొక్కలు నాటి, సంరక్షించాన్నారు. డ్రైనేజీ వ్యవస్థ, మురికి కాల్వలు శుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి ప్రజలకు సూచించారు. ఇంట్లోని చెత్తను రోడ్లపై వేయకుండా.. మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న చెత్తబుట్టలను వాడుకోవాలన్నారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి.. శానిటేషన్ సిబ్బందికి అందించాలని మంత్రి వెల్లడించారు.

ప్రభుత్వం.. నిత్యం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపైనే దృష్టి సారిస్తున్నదని మంత్రి తెలిపారు. ప్రజా ప్రతినిధులంతా ప్రతి పల్లె, పట్టణాల్లో తిరుగుతూ.. పనులను పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలియజేశారు. పేదల కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి ఆడబిడ్డ పెళ్లికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పేరిట రూ. లక్షా 116లు అందజేస్తున్నామని మంత్రి గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి చదువుకు ఏడాదికి లక్ష రూపాయలకు పైగా ఖర్చు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. విద్యార్థులకు సకాలంలో బోధనా రుసుము చెల్లిస్తున్నామన్నారు. పేద విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు సాయం చేస్తున్నామని మంత్రి తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరుతున్నాయన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ కోతలు ఉండేవనీ.. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని మంత్రి గుర్తు చేశారు. ఇళ్లతో పాటు వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సాగు నీరు, తాగునీరు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. సీఎం కేసీఆర్ అన్ని నియోజకవర్గాలను సమదృష్టితో అభివృద్ధి చేస్తున్నారని మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్‌తో పాటు రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎక్సైజ్ మినిస్టర్ శ్రీనివాస్ గౌడ్, రోడ్లు–భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యేలు హరిప్రియ నాయక్, వనమా వెంకటేశ్వర్ రావు, రెడ్యానాయక్, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ ఎం.వి. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మొబైల్ ఫోన్లపై జీఎస్టీ పెంచొద్దు: ఐసీఈఏ

హైదరాబాద్, మొబైల్ ఫోన్లపై జీఎస్టీ రేటును పెంచకూడదని ఇండియన్ సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్(ఐసీఈఏ) అంటోంది. జీఎస్టీ రేట్లను పెంచే ఎలాంటి ప్రతిపాదనను తెలంగాణ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవద్దని సీఎం కేసీఆర్‌ను ఐసీఈఏ కోరింది. మొబైల్ ఫోన్లపై ప్రస్తుతం ఉన్న 12 శాతం జీఎస్టీని 18 శాతానికి పెంచుతారనే ఊహాగానాలు వస్తున్నాయి. ఈ పెంపుతో మొబైల్ ఫోన్ల పెనట్రేషన్‌పై ప్రతికూల ప్రభావం పడుతుందని, డిజిటల్ ఇండియా కింద ప్రభుత్వం చేపడుతోన్న చాలా సర్వీసులు, కోర్ ప్రోగ్రామ్‌లపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. జీఎస్టీ శ్లాబ్ 12 శాతాన్ని ప్రభుత్వం తీసేస్తోందని మీడియా రిపోర్ట్ లు వస్తున్నాయని ఐసీఈఏ చైర్మన్ పంకజ్ మహింద్రో అన్నారు. దీంతో మొబైల్ ఫోన్లపై జీఎస్టీ రేటు 12 శాతం నుంచి 18 శాతానికి పెరుగుతుందని తెలుస్తోంది. ఇది 2020లో మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసే వారిపై ప్రభావం చూపుతుందన్నారు. 2020లో 31 కోట్లకు పైన ప్రజలు ఫోన్లు కొందామనుకుంటున్నట్టు అంచనాలున్నాయి. తెలంగాణలో 97.5 లక్షల మందిపై ప్రభావం పడుతుందని పంకజ్ పేర్కొన్నారు. కేవలం హ్యాండ్‌సెట్లపైనే కాకుండా.. మొబైల్ ఫోన్లకు సంబంధించిన అన్ని కాంపోనెంట్స్, యాక్సరీస్‌పై కూడా జీఎస్టీ రేటు 12 శాతాని కంటే ఎక్కువ ఉండకూడదని పేర్కొన్నారు.

# భారతీయ వ్యవసాయ రంగ పరిశ్రమలో వేతనాల పెంపునకు

## –ఫెయిర్ లేబర్ అసోసియేషన్‌తో సింజెంటా భాగస్వామ్యం

హైదరాబాద్, మార్చి2 ప్రముఖ వ్యవసాయ ఉత్పత్తుల తయారీ సంస్థ 'సింజెంటా' మూడు సంవత్సరాల పాటు భారతదేశ వ్యవసాయ రంగ పరిశ్రమలో వేతనాలను పెంపొందించడానికి పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేసిన నివేదికను బయటపెట్టింది. ఇందులో భాగంగా ఫెయిర్ లేబర్ అసోసియేషన్ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో విత్తనాల ఉత్పాదక రంగంలో వేతనాలను పెంపొందించేందుకు సైంజెంటా చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఆరు సూత్రాల పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. సింజెంటా తన గుడ్ గ్రోథ ప్లాన్ ప్రతి ఒక్క కార్మికుడి దగ్గరకు తీసుకు వెళ్లింది. సింజెంటా గ్లోబల్ సీడ్స్ ప్రొడక్షన్ అండ్ సప్లయి విభాగం హెడ్ బిల్ టొమ్లిన్సన్ స్పందిస్తూ.. ఫెయిర్ లేబర్ అసోసియేషన్‌తో కలిసి ప్రతి కార్మికుడి మానవ హక్కులను పరిరక్షిస్తూ, వారి భద్రతకు చర్యలు చేపట్టాం' అని తెలిపారు. సింజెంటా ఇండియా చీఫ్ సస్టైయినబిలిటీ ఆఫీసర్ డాక్టర్ కేసీ రవి స్పందిస్తూ 'పేదరికంలో మగ్గుతూ కష్టపడి పని చేసే వ్యవసాయ కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇవ్వడం సమంజసం కాదు. మొత్తం వ్యవసాయ రంగంపై కేంద్రీకరించి వ్యవసాయ రంగ వేతనాలపై జాతీయ స్థాయిలో ఒకే విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది' అని పేర్కొన్నారు.

# పాలనా విధానాలను మార్చుకోవాలి-జగన్‌కు మాజీ ఎంపి కోట్ల హితవు

అమరావతి,మార్చి 2(ఆర్ఎన్ఎ): పాలనా విధానాల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన తీరు మార్చుకోవాలని ఏపి సిఎం జగన్‌కు కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి హితవు పలికారు. లేదంటే మరోసారి గెలవడం కష్టమని ఆయన అన్నారు. ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. సంక్షేమ పథకాల అమల్లో పారదర్శకత ఉండాలని సూచించారు. ఐదెకరాల భూమి ఉందనో, కరెంటు బిల్లులు ఎక్కువ వచ్చిందనో పథకాలను నిలిపివేస్తే నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఆదాయ వనరులు, అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పౌరసత్వ సవరణ చట్టంపై పార్లమెంటులో మద్దతు పలికిన వైఎస్ఆర్‌సిపి రాష్ట్రానికి వచ్చేసరికి ముస్లింలను తప్పుతోవ పట్టిస్తోందని ఆరోపించారు. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే సీఏఏకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపైనా కోట్ల విమర్శలు గుప్పించారు. బిజెపి విధానాలన్నీ ప్రజల్ని రెచ్చగొట్టేలా ఉన్నాయని విమర్శించారు.


IN THE COURT OF THE
M.A.C.T-CUM-XII
ADDL CHIEF JUDGE:
CITY CIVIL COURT AT
SECUNDERABAD
M.V.O.P. NO.148 OF 2019

Between:
**Ms. J. Mounika** .....Petitioner
**And**
**Mr. B.Mahender and others** ..... Respondents

To
1).Mr. Bijili Mahender, S/o. B. Sailu, Age: 21 years, Occ: driver of Tata Ace bearing No.AP 22Y 4942, H.no. 11-24/1, Chennareddy Colony, Peerzadiguda, Medipally, Medchal Dist. Telangana., Respondent No.1
2) Mr. Anupa Yadaiah, S/o. Venkataiah, Age: Major, Occ: Owner of Tata Ace bearing No. AP 22Y 4942, R/o. Plot No.24, Madgura Enclave, Alwal, Secunderabad, ...Respondent No.2

Whereas the above named Petitioners filed compensation petition against you and Cholamandalam MS General Insurance Co. Ltd for a sum of Rs.3,00,000/- for the accident caused by your Vehicle Tata Ace bearing No.AP 22Y 4942, on 17-01-2018 at Medipally ps Limites. The above case is posted to **06-03-2020.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 10.30 A.M. on the above said date before the Hon'ble Court, failing which the suit will be heard and determined expate.
(BY ORDER OF THE Honble COURT)

**C. VENU GOPAL REDDY**
**S. VENKAT REDDY**
**A.POORNA CHANDRA RAO**
Advocates.
off: 2-4-120/18,
Swaroop Nagar
Uppal, Hyderabad
Ph: 9440431541


# వెన్నాడిన ఆర్థిక ఇబ్బందులు

## పిల్లలకు విషమిచ్చి దంపతుల ఆత్మహత్య

హైదరాబాద్,మార్చి 2(ఆర్ఎన్ఎ): ఆర్థిక ఇబ్బందులు మరో కుటుంబాన్ని బలితీసుకున్నాయి. పిల్లలను చంపి దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వనస్థలిపురం పరిధిలోని హస్తినాపురంలో సోమవారం ఈ విషాదం నెలకొంది. సంతోషీమాత కాలనీలోని ఓ ఇంట్లో ఇద్దరు పిల్లలను చంపి దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. హస్తినపురంలో నివాస ముంటున్న ప్రదీప్, స్వాతిలు తమ కొడుకు కల్యాణ్ కృష్ణ (5) జయకృష్ణ(1)లకు పురుగుల మందు తాగించి చంపేశారు. అనంతరం వాళ్లు కూడా బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆర్థిక ఇబ్బందులే వీరి మరణానికి కారణమని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతులను ఇబ్రహీంపట్నం వాసులుగా గుర్తించారు. శనివారం నుంచి ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు బద్దలుకొట్టి లోనికి ప్రవేశించారు. లోపల పరిశీలించగా? నలుగురు విగతజీవులుగా పడిఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు

# రైతులెవరూ రుణమాఫీపై ఆందోళన చెందవద్దు: మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మార్చి 2: టీఆర్ఎస్‌కు ప్రజలు తిరుగులేని విజయాలందిస్తున్నారని టీఆంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో 906 సంఘాలకు ఎన్నికలు జరిగితే 94 శాతానికిపైగా సంఘాల్లో రైతులు టీఆర్ఎస్‌ను గెలిపించారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిర్వాకం వల్ల దేశంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్రంలో దాని ప్రభావం కొంత తక్కువగా ఉందన్నారు. నూతనంగా ఎన్నికైన డీసీసీబీ, డీసీఎంఎస్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లతో కేటీఆర్ తెలంగాణ భవన్‌లో భేటీ అయ్యారు. 'టీఆర్ఎస్ రైతుపక్షపాత ప్రభుత్వం. రైతుబీమా, రైతుబంధు వంటి పథకాలను ప్రవేశపెట్టిన తొలి రాష్ట్రం ఇది. రైతు సంక్షేమం కోసం ఎంత ఖర్చైనా వెనుకాడటం లేదు. సహకార సంఘం ఎన్నికల్లో రైతులు అపూర్వ విజయాన్ని అందించారు. రుణమాఫీ ప్రక్రియ త్వరలోనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారు. త్వరలోనే రైతు రుణమాఫీ జరుగుతుంది. రైతులెవరూ రుణమాఫీపై ఆందోళన చెందవద్దు. సహకార సంఘం ఎన్నికల్లో మరోసారి టీఆర్ఎస్‌ను గెలిపించారు. డీసీసీబీ ఛైర్మన్ల ఎన్నికల్లో దళితులకు ప్రాధాన్యం ఇచ్చాం. రైతాంగ సమస్యలపైన ప్రతిపక్షాలు చేసే విమర్శలను తిప్పికొట్టాలి. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడాలని' కేటీఆర్ పిలుపునిచ్చారు.

# 4నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

## నిముషం ఆలస్యం అయినా నో ఎంట్రీ
## 15 నిముషాల ముందే కేంద్రాల్లోకి అనుమతి
## భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
## వివరాలు వెల్లడించిన మంత్రి సబిత

హైదరాబాద్,మార్చి 2(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 4వ తేదీ నుంచి ప్రారంభంకానున్నాయి. ఉ. 9 గంటల నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల్లోకి సెంటర్‌లోకి అనుమతి ఇవ్వనున్నట్లు అధ ఇకారులు తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించమని ఇంటర్ బోర్డు అధికారులు చెప్పారు. ఇంటర్ విద్యార్థుల కోసం అదనపు బస్సు సర్వీస్‌లు నడుపుతున్నామని వివరించారు. విద్యార్థులను నేలమీద కూర్చోబెడితే ఆ కళాశాలపై చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డి హెచ్చరించారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి చిత్రా రామచంద్రన్ కలసి మీడియా సమావేశంలో తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. ఎగ్జామ్ సెంటర్ లొకేటర్ యాప్ ద్వారా పరీక్షా కేంద్రాన్ని గుర్తించొచ్చు అని అనితా రామచంద్రన్ వివరించారు. ఇంటర్‌బోర్డు అధికారిక వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయాన్ని బోర్డు అధికారులు కల్పించారు. మార్చి 4వ తేదీ నుంచి మార్చి 18 వరకు నిర్వహిచనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులకు తాగు నీరు, వైద్య సిబ్బంది, పార్కింగ్ వసతి, వాష్ రూమ్స్, ఫ్యాన్ సౌకర్యం, రాత బల్లలు, విద్యుత్ వసతి, ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేయనున్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. అలాగే జిరాక్స్ సెంటరుల మూసివేత, ప్రతి పరీక్ష సెంటర్ వద్ద ఒక కానిస్టేబుల్‌ను నియమించనున్నారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగనున్నాయి. అరగంట ముందు విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఇస్తారు. ఒక్క నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరని తెలిపారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు ఉదయం 8 గంటల్లోగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో కార్యాచరణ రూపొందించారు.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

## స్వల్పంగా తగ్గుతూ భారీగా పెరుగుతున్న రేట్లు

న్యూఢిల్లీ,మార్చి 2(ఆర్ఎన్ఎ): దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు మళ్లీ పెరుగుతూనే ఉన్నాయి. భారీగా పెగడం..స్వల్పంగా తగ్గుదల కారణంగా బంగారం ధరలు దూసుకుని పోతున్నాయి. నాలుగు రోజుల నష్టాలకు చెక్ పెట్టిన ధరలు సోమవారం మళ్లీ ర్యాలీ అయ్యాయి. దేశీయ మల్టీ కమోడిటీ మార్కెట్‌లో శుక్రవారం ముగింపుతో పోలిస్తే రూ.593 పెరిగి 10 గ్రాముల పసిడి రూ.41,829 వద్ద ట్రేడ్ అయింది. మునుపటి సెషన్‌లో భారీగా పడిపోయిన తరువాత బంగారం ధరలు ఫ్యూచర్ మార్కెట్లో1.42 శాతం ఎగిసాయి. కిలో వెండి ధర రూ. 45350 వద్ద కొనసాగుతోంది. అటు ప్రపంచ మార్కెట్లలో, మునుపటి సెషన్లో 5 శాతం నష్టపోయిన పసిడి ఈరోజు లాభాల్లో వుంది. కరోనా వైరస్ వివిధ దేశాలకు విస్తరిస్తుండడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో శనివారం ముగింపుతో పోలిస్తే బంగారం 18 డాలర్లు పెరిగి ఔన్స్ బంగారం ధర 1,603 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. వెండి 1.3 శాతం పెరిగి ఔన్సు ధర 16.88 డాలర్లకు చేరింది. ఇతర విలువైన లోహాలలో పల్లాడియం ఔన్స్‌కు 0.7 శాతం పెరిగి 2,611 డాలర్లు, ఎ÷–లాటినం 1.9 శాతం 880 డాలర్లకు చేరుకుంది. మరోవైపు శుక్రవారం 1500 పాయింట్లకు పైగా కుప్పకూలిన దేశీయ స్టాక్‌మార్కెట్లు సోమవారం భారీగా రికవరీ సాధించాయి. ఆరంభంలోనే దాదాపు 750 పాయింట్లు ఎగిసిన సెన్సెక్స్ ప్రస్తుతం 587 పాయింట్ల లాబంతో 39 వేల మార్కుకు దిగువన, నిఫ్టీ 164 పాయింట్ల లాభంతో 11365 వద్ద 11500 స్థాయికి దిగువన కొనసాగుతోంది. మరోవైపు కోవిడ్–19 ఆందోళన, ఆర్థిక మందగమనంపై శుక్రవారం ఫెడ్ చైర్ జెరోమ్ పావెల్ ఒక ప్రకటన విడుదల చేశారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com